
# చట్టం

సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

నిజామాబాద్
గురువారం
04.06.2026

సంపుటి : 16 సంచిక: 249
పేజీలు:7 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్

## తండ్రీ తాలూకు ప్రపంచం

రవితేజ తాజా చిత్రం 'ఇరుముడి' నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నది. ఆధ్యాత్మిక భావాల్ని ప్రతిబింబించే టైటిల్‌తో తండ్రికూతుళ్ల అనుబంధం ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండటమే అందుక్కారణం. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. బుధవారం 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' పేరుతో గ్లింప్స్‌ను విడుదల చేశారు. కూతురే ప్రపంచంగా బతికే తండ్రీ, వారిద్దరి మధ్య అనుబంధాన్ని ఆవిష్కరిస్తూ గ్లింప్స్ హృద్యంగా సాగింది. అయ్యప్పదీక్ష తాలూకు విజువల్స్ భావోద్వేగభరితంగా అనిపించాయి.యాక్షన్ ఎలిమెంట్స్ కథపై మరింత ఆసక్తిని పెంచేలా ఉన్నాయి. ఓ తండ్రీ తాలూకు ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ ఈ గ్లింప్స్ హార్ట్‌టచింగ్‌గా సాగింది. ప్రియా భవానీ శంకర్, సాయికుమార్, బేబీ నక్షత్ర, అజయ్‌ఘోష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: శివ నిర్వాణ.

# 21 మంది సజీవ దహనం

- దిల్లీ హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం, 21 మంది మృతి
- ఎలక్ట్రిక్ స్టవ్ వల్ల మంటలు వ్యాపించాయి
- అనుమతి లేని అదనపు గదుల నిర్వహణే ప్రాణనష్టానికి కారణం
- బాధితులు మెజారిటీ విదేశీ పర్యాటకులు
- మృతులకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేల పరిహారం
- ఘటనపై విచారణ మొదలైంది, బాధ్యులపై కఠిన చర్యలు

దక్షిణ దిల్లీలోని మాలవీయనగర్‌లో సంభవించిన ఘోర అగ్నిప్రమాదం దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. మికాసా-ఇన్ హోటల్‌లో బుధవారం ఉదయం చెలరేగిన మంటలు 21 మంది నిండు ప్రాణాలను బలిగొన్నాయి. నిశ్శబ్దంగా సాగుతున్న ఉదయం వేళ ఒక్కసారిగా మొదలైన ఈ విపత్తు హోటల్‌లో బస చేసిన అతిథుల పాలిట యమపాశమైంది. దట్టమైన పొగలు, ఎగసిపడుతున్న మంటల ధాటికి గదుల్లోనే చిక్కుకుపోయిన బాధితులు ఊపిరి ఆడక విలవిల్లాడారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక శకటాలు, పోలీసులు యుద్ధప్రాతిపదికన ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలను ముమ్మరం చేశారు. భయానక వాతావరణం నెలకొన్న ఆ ప్రాంతంలో స్థానికులు, అధికారుల మధ్య ఆందోళన కనిపిస్తోంది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా పూర్తిగా తెలియరాలేదు. ఉదయం 8.50 గంటల ప్రాంతంలో మంటలు వ్యాపించినట్లు ప్రాథమిక నివేదికలు చెబుతున్నాయి. హోటల్‌లోని 25 గదుల్లో సుమారు 40 మంది అతిథులు నిద్రిస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. వీరిలో ఎక్కువమంది వైద్య చికిత్సల నిమిత్తం దిల్లీకి వచ్చిన విదేశీయులే కావడం కలచివేస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో ఎలక్ట్రిక్ స్టవ్‌ను ఆన్ చేయడానికి ప్రయత్నించినప్పుడు ఒక్కసారిగా మంటలు వ్యాపించాయని హోటల్ చెఫ్ పేర్కొన్నారు. ఆ మంటలు నిమిషాల వ్యవధిలోనే హోటల్ అంతటా ఆవరించడంతో పరిస్థితి విషమించింది. భారీ ప్రమాదం జరిగిన తీరు పట్ల నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.



**చట్టం, జాతీయం:**

బాధితుల ఆర్తనాదాలు, కిటికీల నుండి కిందకు దూకుతున్న వ్యక్తుల దృశ్యాలు స్థానికులను భయాందోళనలకు గురిచేశాయి. ప్రాణాలు దక్కించుకునే క్రమంలో కొందరు భవనం పైనుంచి దూకి తీవ్రంగా గాయపడ్డారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సెల్లార్‌లో చిక్కుకుపోయిన ముగ్గురిని పోలీసులు చాకచక్యంగా రక్షించారు. మిగిలిన వారిని అంబులెన్స్‌లలో సమీపంలోని ఆసుపత్రులకు తరలించి అత్యవసర వైద్యం అందిస్తున్నారు. హోటల్‌కు ఉన్న పరిమిత అనుమతులు, నిర్వహణలో జరిగిన నిర్లక్ష్యం గురించి ప్రస్తుతం చర్చనీయాంశమవుతోంది. బాధితుల బంధువులు ఆసుపత్రుల వద్ద కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దిల్లీ ప్రభుత్వ బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద కేవలం ఆరు గదులకు మాత్రమే నిర్వహణ అనుమతులు ఉండగా, అది 25 గదులతో నడపడం తీవ్ర ఉల్లంఘనగా కనిపిస్తోంది. తగిన భద్రతా ప్రమాణాలు పాటించకుండా ఇంతమందిని ఒకేచోట బస చేయించడం వెనుక ఉన్న నిర్లక్ష్యంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి అక్రమంగా గదులను పెంచి వ్యాపారం చేయడం వల్లే ఇంతటి భారీ ప్రాణనష్టం జరిగిందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. చట్టపరమైన లోపాలు ఈ ప్రమాద తీవ్రతను పెంచాయని స్థానికులు గట్టిగా వాదిస్తున్నారు. ఈ విషాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు కేంద్రం తరపున అన్ని రకాల సహాయం అందుతోందని, ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఒక్కో మరణానికి రెండు లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. గాయపడిన వారికి కూడా యాభై వేల రూపాయల చొప్పున సాయం చేస్తామని స్పష్టం చేశారు. బాధ్యులెవరైనా వదిలి పెట్టే ప్రసక్తే లేదని కేంద్రం సంకేతాలు పంపింది. దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కూడా స్వయంగా ఘటనాస్థలాన్ని పర్యవేక్షించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ, ఈ కష్ట సమయంలో ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఫైర్ సర్వీసెస్, పోలీసులు, డీడీఎంఏ, క్యాట్స్ అంబులెన్స్ సిబ్బంది సకాలంలో స్పందించి మరిన్ని ప్రాణాలు కాపాడగలిగారని ఆమె పేర్కొన్నారు. రక్షణ బృందాల పనితీరును అభినందిస్తూ, బాధితులకు మెరుగైన వైద్యం అందించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టడం పట్ల పలువురు ప్రశంసలు వ్యక్తం చేశారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే కూడా ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఎక్స్ వేదికగా సంతాపం తెలిపారు. గాయపడిన వారు ప్రాణాపాయం నుండి బయటపడి ఆరోగ్యంగా తిరిగి రావాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బాధితులకు తగిన నష్టపరిహారం చెల్లించాలని, ఘటనపై పారదర్శకమైన విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ శ్రేణులు కష్టకాలంలో బాధిత కుటుంబాలకు సాధ్యమైనంత మేరకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. రాజకీయ నేతలు ఈ ఘటనను తీవ్రంగా పరిగణించి నిరసనలు తెలుపుతున్నారు. నగరంలో ఇలాంటి అగ్నిప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. హోటళ్లు, వాణిజ్య సముదాయాల్లో అగ్నిమాపక వ్యవస్థల పనితీరుపై నిరంతరం నిఘా ఉంచాలని నగరవాసులు కోరుతున్నారు. కఠినమైన భద్రతా ఆడిటింగ్ లేకపోవడం వల్లనే ఇటువంటి ప్రమాదాల్లో అమాయకులు బలవుతున్నారని మేధావులు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా యంత్రాంగం కళ్లు తెరిచి నిబంధనలను అతిక్రమించే సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ వినిపిస్తోంది.

## కచ్చితంగా తెలంగాణ భూమిపుత్రుల జాగీరే

- ఈ దేశంలో ఏ నాయకుడైనా పార్టీ పెట్టవచ్చు
- జనసేన కొత్తగా పోటీ చేసేదేముంది?
- కచ్చితంగా తెలంగాణ భూమిపుత్రుల జాగీరే
- దేశభక్తి గురించి పవన్ కళ్యాణ్ నేర్పాల్సిన అవసరం లేదు



**చట్టం, స్టేట్ బ్యూరో:**

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. దేశంలో ఎవరికైనా పార్టీ పెట్టే హక్కు ఉందని, ఎక్కడైనా ఎన్నికల్లో పోటీ చేసే స్వేచ్ఛ ఉందని చెప్పిన ఆయన.. ఏ ప్రాంతంలో రాజకీయాలు చేయాలనుకుంటే ఆ ప్రాంత చరిత్ర, పోరాటాలు, ప్రజల భావోద్వేగాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ గతంలో (2023) కూడా తెలంగాణలో ఎన్నికల్లో పోటీ చేశారని, ఆయనను ఎవరూ అడ్డుకోలేదని గుర్తు చేశారు. గత పన్నెండేళ్లలోనో ఆయనకు ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున రాజకీయ సభ నిర్వహించాల్సిన అవసరం పవన్‌కు ఏముందని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రాంతీయవాదం గురించి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ కేటీఆర్ విమర్శలు గుప్పించారు. 'మద్రాస్ రాష్ట్రం నుంచి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ఆమరణ దీక్ష కూడా ప్రాంతీయవాదమేనా?. తెలంగాణ ఉద్యమం కూడా ప్రజల ఆకాంక్షల కోసం జరిగిన పోరాటమే. దానిని తప్పుగా చిత్రీకరించడం సరికాదు. దేశభక్తి విషయంలో మాకు ఎవరి దగ్గరా పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక పరిశ్రమలు గుజరాత్‌కు వెళ్లిపోయాయి. అదే సమయంలో విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమానికి మేము మద్దతు ఇచ్చాము' అని కేటీఆర్ గుర్తు చేశారు. 'పవన్ కళ్యాణ్‌ను ఉప ముఖ్యమంత్రిగా గౌరవిస్తాం, నటుడిగా అభిమానిస్తాము. పవన్ ఇంటికి వస్తే బిర్యానీ పెట్టి మర్యాద చేస్తాం. కానీ మా సచివాలయంలో కూర్చొని తెలంగాణ గురించి తక్కువ చేసి మాట్లాడితే ఊరుకోం. పవన్ కళ్యాణ్ ఓజీ సినిమా చేశారు. తెలంగాణకు అసలైన ఓజీ కేసీఆర్. తెలంగాణ ఒక్క ఓజీ చాలు, ఇంకొకరు అసవరం లేదు. తెలంగాణ రాష్ట్రం సులభంగా వచ్చినది కాదు. వేలాది మంది త్యాగాలు, దశాబ్దాల ఉద్యమ ఫలితంగా రాష్ట్రం ఏర్పడింది. పవన్ కళ్యాణ్ అయినా, మరెవరైనా దేశంలో ఎక్కడైనా పోటీ చేయవచ్చు. అయితే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని గౌరవించాల్సిందే. ఖచ్చితంగా తెలంగాణ భూమిపుత్రుల జాగీరే. ఈ రాష్ట్రం కోసం జరిగిన పోరాటాన్ని ఎవరూ తక్కువ చేసి చూడలేరు' అని కేటీఆర్ ఫైర్ అయ్యారు.

## కోట్లు కురిపించే 'క్రికెట్ బెట్టింగ్' డాన్

- గోల్డ్ అప్రైజర్‌గా పనిచేసిన వీరశేఖరాచారి
- ఈజీ మనీ కోసం అడ్డదారులు
- 15 ఏళ్ల క్రితం క్రికెట్ బెట్టింగ్‌లో పంటర్‌గా అవతారం
- బెట్టింగ్‌లలో డాన్‌గా మారిన వీరశేఖరాచారి
- గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో కేసులు
- విజయవాడకు చెందిన కళ్యాణచక్రవర్తికి టోకరా
- నంద్యాల జిల్లా మహానందిలో వీరశేఖరాచారి పట్టివేత

**చట్టం, స్టేట్ బ్యూరో:**

అతనో గోల్డ్ అప్రైజర్ జల్సాలు, విలాసాలకు అలవాటు పడ్డాడు అంతే కొత్త అవతారం ఎత్తాడు క్రికెట్ బెట్టింగులతో కోట్లు సంపాదించాలని భావించాడు మొదట పంటర్‌గా అవతారం ఎత్తాడు తర్వాత బుకీగా మారాడు పెద్ద పెద్ద బుకీలతో లింకులు పెట్టుకుని బెట్టింగ్ సామ్రాజ్యాన్ని విస్తరించాడు. మూడు జిల్లాల పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా మారిన ఆ బుకీ ట్రేడింగ్ పేరుతో మోసం చేసి అడ్డంగా పల్నాడు జిల్లా పోలీసులకు దొరికిపోయాడు. ఈ ఫొటోలో కనిపిస్తున్న ఇతని పేరు వీరశేఖరాచారి అలియాస్ గోల్డ్ శేఖర్. ఊరు నర్సరావుపేట. మొదట గోల్డ్ అప్రైజర్‌గా పనిచేసేవాడు. కానీ ఉన్నఫళంగా కోట్లు సంపాదించాలనే దురాశతో ఈజీ మనీ కోసం అడ్డదారులు తొక్కాడు. ఈజీ మనీ కోసం.. క్రికెట్ బెట్టింగ్‌ను ఎంచుకున్నాడు. 15 ఏళ్ల క్రితం స్టార్ట్ చేసిన క్రికెట్ బెట్టింగ్‌లో మొదట పంటర్ అవతారం ఎత్తాడు. ఆ సమయంలో బెట్టింగ్‌ల ద్వారా కమీషన్ రూపంలో భారీగా డబ్బులు వచ్చాయి. అయినప్పటికీ కోట్ల రూపాయలు సంపాదించాలన్న దురాశ ఇంకా పెరిగింది. అంతే.. పంటర్ స్థాయి నుంచి పూర్తిస్థాయిలో బుకీగా మారాడు. పెద్ద ఎత్తున డబ్బులు వస్తుండడంతో తన బెట్టింగ్ సామ్రాజ్యాన్ని మరింత విస్తరించాడు. ఎక్కడికక్కడ అనుచరులను ఏర్పాటు చేసుకుని పెద్ద ఎత్తున బెట్టింగులకు తెరతీశాడు. తొలుత పల్నాడు జిల్లాలో స్టార్ట్ చేసిన బెట్టింగ్‌లను కాస్తా పక్క జిల్లాలకు కూడా విస్తరించాడు. కొద్ది రోజుల్లోనే క్రికెట్ బెట్టింగ్‌లలో వీరశేఖరాచారి డాన్‌గా మారిపోయాడు. బెట్టింగ్‌లు వేస్తున్న సమయంలోనే అప్పుడప్పుడు పోలీసులకు పట్టుబడ్డాడు. ఫలితంగా వీరశేఖరాచారిపై గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో మూడు జిల్లా పోలీసులకు మోస్ట్ వాంటెడ్ క్రికెట్ బుకీగా మారాడు. బెట్టింగ్‌లతో ఆగని.. వీరశేఖరాచారి మరిన్ని మోసాలకు తెరతీశాడు. తాము ట్రేడింగ్ చేస్తున్నామని.. ట్రేడింగ్‌లో డబ్బులు పెడితే భారీగా లాభాలు వస్తాయని మాయమాటలు చెప్పి విజయవాడకు చెందిన కళ్యాణచక్రవర్తిని నమ్మించాడు. దీంతో కళ్యాణ చక్రవర్తి కోటి 44 లక్షల రూపాయలు తన అనుచరుడైన రవితేజ ఎకౌంట్‌కు ట్రాన్స్ ఫర్ చేశాడు. తర్వాత రవితేజ తన భార్య లలిత ఎకౌంట్‌కు.. ఆ తర్వాత వీరశేఖరాచారి ఎకౌంట్‌కు కోటి 44 లక్షల రూపాయలు బదిలీ అయ్యాయి. డబ్బులు తీసుకున్న తర్వాత కళ్యాణచక్రవర్తి ఫోన్ చేసినా స్పందిచలేదు వీరశేఖరాచారి. దీంతో తాను మోసపోయానని భావించిన కళ్యాణచక్రవర్తి నర్సరావుపేట టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అయితే క్రికెట్ బెట్టింగులకు పాల్పడుతున్నవారిపై పల్నాడు జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపడంతో వీరశేఖరాచారి అజ్ఞాతంలోకి వెళ్లాడు. పోలీసులు వీరశేఖరాచారి కోసం గాలింపులు చేపట్టారు. ఎట్టకేలకు వీరశేఖరాచారి నంద్యాల జిల్లా మహానందిలో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు.. అదుపులోకి తీసుకున్నారు. వీరశేఖరాచారిపై పన్నెండు కేసులున్నట్లు పోలీసులు చెబుతున్నారు. బెట్టింగ్ కేసులతోపాటు పోక్సో కేసు, NDPS కేసులు రెండు నమోదయ్యాయంటున్నారు. ఈజీ మనీకోసం క్రికెట్ బెట్టింగులకు తెరతీసిన వీరశేఖరాచారికి పెద్ద పెద్ద బుకీలతో కూడా సంబంధాలున్నాయని తేలిందంటున్నారు. ప్రకాశం జిల్లా దర్శి పోలీసులు బెట్టింగ్ కేసులో అరెస్ట్ చేస్తే బెయిల్ పై విడుదలయ్యాడని చెబుతున్నారు. కడపలో కూడా వీరశేఖరాచారిపై బెట్టింగ్ కేసు నమోదయ్యిందని గుర్తించారు. ట్రేడింగ్ పేరుతో ఛీటింగ్ చేసిన కేసులో మరో ఇద్దరి కోసం గాలింపులు కొనసాగుతున్నాయంటున్నారు. ట్రేడింగ్ పేరుతో డబ్బులు తీసుకుని ఆ డబ్బులను క్రికెట్ బెట్టింగులో పెట్టినట్లు పోలీసులు గుర్తించారు.




## తెలంగాణ టీచర్లకు భారీ శుభవార్త

**చట్టం, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక అత్యంత తీపి కబురు అందించింది. ప్రస్తుతం విధుల్లో ఉన్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల ప్రయోజనార్థం రెండు ప్రత్యేక ఉపాధ్యాయ అర్హత పరీక్షలను నిర్వహించేందుకు ప్రభుత్వం అధికారికంగా అనుమతి మంజూరు చేసింది. సాధారణంగా ప్రతి ఏటా షెడ్యూల్ ప్రకారం నిర్వహించే రెండు రెగ్యులర్ టెట్ పరీక్షలకు ఇది పూర్తిగా అదనం. అంటే, ఇకపై ప్రతి సంవత్సరం జరిగే రెండు సాధారణ టెట్ పరీక్షలతో పాటు, కేవలం ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కోసమే ప్రత్యేకంగా మరో రెండు అదనపు టెట్ పరీక్షలను విద్యాశాఖ నిర్వహించనుంది. ఈ నిర్ణయానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ విభాగం అధికారికంగా ఒక మెమోను జారీ చేసింది. ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా పేరుతో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి సమర్పించిన లేఖలతో పాటు, ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ టీఎస్ , ది స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ , తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (TRTF) వంటి వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అందించిన విజ్ఞప్తులను ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించింది. వీటితో పాటు తెలంగాణ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ & టెట్ చైర్మన్ పంపిన ప్రతిపాదనలను, నివేదికలను పూర్తిగా పరిశీలించిన అనంతరమే ప్రభుత్వం ఈ కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. ఈ ప్రత్యేక టెట్ పరీక్షల నిర్వహణకు సంబంధించి తదుపరి అవసరమైన అన్ని రకాల చర్యలను, ఏర్పాట్లను తక్షణమే చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కూడా టెట్ అర్హత తప్పనిసరి అయిన నేపథ్యంలో.. రాష్ట్ర ప్రభుత్వ తీసుకున్న ఈ నిర్ణయం ఇన్‌సర్వీస్ టీచర్లకు ఎంతో ఊరటనిచ్చే అంశంగా మారింది.




## తెలంగాణలో భూములకు కొత్త ధరలు

**చట్టం, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో కీలక మార్పు చోటుచేసుకోబోతోంది. రాష్ట్రవ్యాప్తంగా సవరించిన భూముల మార్కెట్ విలువలు ఈ నెల 5వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార అండ్ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారికంగా ప్రకటించారు. క్షేత్రస్థాయిలో వాస్తవ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ విలువలకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసాలను తొలగించి, అత్యంత శాస్త్రీయంగా, హేతుబద్ధంగా ఈ కొత్త ధరలను నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు ప్రముఖ ఆర్థిక నిపుణుడు అరవింద్ సుబ్రమణ్యం ఇచ్చిన నివేదికను, ఉన్నతాధికారుల సలహాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 22లో ఎలాంటి క్షేత్రస్థాయి అధ్యయనం లేకుండా కేవలం ఆరు నెలల వ్యవధిలోనే రెండుసార్లు అశాస్త్రీయంగా ధరలను పెంచిందని, దీనివల్ల కొన్ని ప్రాంతాల్లో మార్కెట్ రేటు కంటే ప్రభుత్వ విలువలు భారీగా పెరిగాయని మంత్రి విమర్శించారు. ఈ అసమానతలను సరిదిద్దేందుకు రాష్ట్రంలోని మొత్తం 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువల సవరణ చేపట్టారు. ఈ కొత్త విలువల నిర్ణయంలో పారిశ్రామికాభివృద్ధి, కొత్త రహదారులు, ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్, మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాలను ప్రాధాన్యతగా తీసుకున్నారు. ఇప్పటికే అధిక రేట్లు ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి పెంపుదల చేయలేదు. అలాగే, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లలో అంతస్తుల వారీగా ఉన్న అసమానతలను తొలగించి అన్ని అంతస్తులకు ఒకే రేటు వర్తింపజేశారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ పరిధిలోని వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కనీస ప్రాథమిక రేట్లను కూడా ఖరారు చేశారు. మరోవైపు.. గత ఐదేళ్లలో నిర్మాణ సామగ్రి ధరలు, కార్మికుల వేతనాలు పెరిగిన నేపథ్యంలో 2021 తర్వాత మొదటిసారిగా నిర్మాణ వ్యయాల రేట్లను కూడా సవరించారు. అనేక పంచాయతీలు మున్సిపాలిటీలుగా మారిన నేపథ్యంలో ఆర్‌సీసీ, నాన్‌ఆర్‌సీసీ నిర్మాణాల రేట్లను గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు అనుగుణంగా మార్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, భూ లావాదేవీలలో పారదర్శకతను పెంచుతూ, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.



CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# స్టడీ టూర్ సందర్శనలో వేములవాడ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు



**చట్టం న్యూస్, వేములవాడ రూరల్ :** వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ స్టడీ టూర్ కార్యక్రమం లో భాగంగా వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు ఆధ్వర్యంలో బుధవారం పాలకవర్గ సభ్యులు అందరూ కలిసి వివిధ ప్రాంతాలలో ఉన్నటువంటి మార్కెట్ యార్డులను, ఆయా ప్రాంతాల్లో పండించే పంటలను సందర్శించ డానికి వెళ్లడం జరిగింది. వెళ్ళిన వారిలో వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, డైరెక్టర్లు కత్తి కనకయ్య, ఖమ్మం గణేష్, పాలకుర్తి పరశురాం, చెరుకు శంకర్, మానుపాటి పరుశురాం తదితరులు ఉన్నారు.

# నూతన మున్సిపల్ కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**చట్టం న్యూస్ మోస్రా :** బాన్సువాడ మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన గంగాధర్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు యండి. దావూద్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ మాజీద్ (ముజ్జు) కమిషనర్ గంగాధర్‌కు పూల బొకే అందజేసి అభినందనలు తెలియజేశారు. బాన్సువాడ పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో సమర్థవంతంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతలు చేపట్టిన కమిషనర్ గంగాధర్‌కు వారు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పట్టణ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

# దేవాదాయ భూముల వేలంలో రైతుల పోటీ

- రూ.1.57 లక్షలకు లీజు దక్కించుకున్న రైతు



**చట్టం న్యూస్ బీర్కూర్ :** బీర్కూర్ గ్రామంలోని దేవాదాయ శాఖకు చెందిన 2.29 గుంటల వ్యవసాయ భూమిని బుధవారం బహిరంగ వేలం ద్వారా లీజుకు కేటాయించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అరిగే ధర్మతేజ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం కార్యక్రమానికి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు. దేవాదాయ శాఖ నిబంధనల మేరకు నిర్వహించిన ఈ వేలంలో పలువురు రైతులు పోటీపడగా, చివరకు జుకంటి బాబాబోయి అనే రైతు అత్యధికంగా రూ.1,57,000కు వేలం పాడి భూమిని దక్కించుకున్నారు. ఈ భూమిని రెండు సంవత్సరాల కాలపరిమితికి లీజు ప్రాతిపదికన కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు.వేలం ప్రక్రియ ప్రారంభానికి ముందు దేవాదాయ శాఖ అధికారులు భూమికి సంబంధించిన వివరాలు, లీజు నిబంధనలు, కాలవ్యవధి తదితర అంశాలను రైతులకు వివరించారు. అనంతరం బహిరంగంగా వేలం నిర్వహించగా రైతులు ఆసక్తిగా పాల్గొని పోటీపడ్డారు. గ్రామంలోని దేవాదాయ భూముల ద్వారా దేవాలయ ఆదాయం పెరగడంతో పాటు వ్యవసాయదారులకు సాగు అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రక్రియ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ అరిగే ధర్మతేజ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాలు మరియు దేవాదాయ శాఖ నిబంధనలకు అనుగుణంగా పూర్తిస్థాయి పారదర్శకతతో వేలం నిర్వహించామని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధితో పాటు దేవాలయాల ఆదాయ వనరులు పెరిగే విధంగా ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎండోమెంట్ శాఖ అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది, రైతులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పట్టుదలతో చదివి ఐఐటి కి ఎంపికైన నిరుపేద గిరిజన విద్యార్థిని



**చట్టం ధర్పల్లి :** ధర్పల్లి మండలంలోని దమ్మన్నపేట తండాకు చెందిన, గుడ్ లోతు గంగాదేవి అనే విద్యార్థిని, నిరుపేద కుటుంబం నుండి వచ్చి చిన్నప్పటినుండి చదువులో రాణిస్తూ, ఇటీవల జేఈఈ అడ్వాన్స్ పరీక్షలు రాసి ఆల్ ఇండియా ర్యాంకు సాధించి ఐఐటీకి ఎంపిక కావడంతో, విద్యార్థిని తల్లిదండ్రులు దేవిలాల్ దంపతులు, సహచర విద్యార్థిని విద్యార్థులు, తండావాసులు నాయకులు విద్యార్థిని గంగాదేవిని అభినందిస్తున్నారు. విద్యార్థిని గంగాదేవి మాట్లాడుతూ, ఎలాగైనా ఐఐటీకి ఎంపిక కావాలని పట్టుదలతో నిరంతరం చదివి ఆల్ ఇండియా ర్యాంకు సాధించాలని తెలిపారు. విద్యార్థి గంగాదేవిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు.

# పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**చట్టం రామగుండం :** పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ నాయకులతో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అధ్యక్షతన బుధవారం రోజున ఉదయం గోదావరిఖని గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తొలి సమీక్షా సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రతి మండలంలో పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయాలని ఆయన సూచించారు. పార్టీ అధిష్టానం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నాయకులు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ కార్యాచరణ, మండల స్థాయి పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు, ప్రజా సమస్యలపై పోరాటాలు, సోషల్ మీడియా వినియోగం, పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# 5 లక్షల రూపాయలు నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు



**చట్టం పెద్దపల్లి :** పెద్దపల్లి మండలం కాసులపల్లి గ్రామంలో బైపాస్ రోడ్డు నుండి బీరప్ప స్వామి ఆలయం వరకు 5 లక్షల రూపాయలు నిధులతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన తదుపరి బీరన్న పట్నాల మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు.జూలపల్లి మండలం,పెద్దపూర్ గ్రామంలోని బీరన్న పట్నాల సందర్భంగా ఆలయంలో స్థానిక నాయకులతో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కాంగ్రెస్ పార్టీలో చేరిన హన్మాజీపేట ఉపసర్పంచ్ ఆవునూరి శంకరవ్వ
- కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు తుది దశకు చేరుకుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన గ్రామ ఉపసర్పంచ్ ఆవునూరి శంకరవ్వ శంకరయ్య వార్డు సభ్యులు ఆవునూరి కార్తీక్, కోడం రవి, గొర్రె నర్సవ్వ తో పాటు సుమారు 50 మంది ముఖ్య కార్యకర్తలతో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ చేరగా విప్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు, నియోజకవర్గంలో తాము చేపడుతున్న నిరంతర అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై అనేక గ్రామాల్లో సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున వలసలు వస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దడమే తన ఆశయమని, అందుకోసం రాజకీయాలకు అతీతంగా నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. హన్మాజీపేట గ్రామ ప్రగతికి, మౌలిక వసతుల కల్పనకు తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు.



**రైతులకు అండగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇప్పటికే వడ్ల కొనుగోళ్లు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు. రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఐకేపీ కేంద్రాల ద్వారా పారదర్శకంగా ప్రక్రియ సాగుతోందని చెప్పారు. అయితే, కొందరు వ్యక్తులు తమ రాజకీయ స్వార్థం కోసం, ఉనికిని చాటుకోవడం కోసం సామాజిక మాధ్యమాల్లో, బయట వడ్ల కొనుగోళ్లపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు... నిన్నటి వరకు జిల్లాలో సుమారు 2,75,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు ఆయన వెల్లడించారు. గత రబీ సీజన్‌లో 2,69,000 మెట్రిక్ టన్నుల వరి కొనుగోలు జరగగా, ఈసారి ఇప్పటికే గత ఏడాదికంటే 6,000 మెట్రిక్ టన్నులు అధికంగా కొనుగోలు జరిగిందన్నారు. ఇంకా జిల్లాలోని కొనుగోలు కేంద్రాల వద్ద మరో 35,000 మెట్రిక్ టన్నుల వరి వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నట్లు చెప్పారు. ఈసారి వరి దిగుబడి గణనీయంగా పెరిగినప్పటికీ రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద, రైస్ మిల్లర్ల వద్ద, గోదాముల వద్ద ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. రైస్ మిల్లుల్లో స్థలాభావం లేదా గోదాముల్లో నిల్వ సమస్యలు తలెత్తిన సందర్భాల్లో కూడా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ నిల్వ సదుపాయాలు కల్పించి ధాన్యాన్ని వెంటనే తరలించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.అవసరమైన చోట్ల గోదాములు, నిల్వ కేంద్రాలు వినియోగంలోకి తెచ్చి రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవస్థను నడిపిస్తున్నామని వివరించారు. వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు.. వ్యవసాయనికి మూడు గంటల విద్యుత్ చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ఉద్దేశపూర్వకంగానే కేటీఆర్ తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను, పుకార్లను రైతులు, ప్రజలు ఎవరూ నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా పార్టీ శ్రేణులు చొరవ చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోయినేని కరుణాకర్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సామ తిరుపతిరెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తీగల ఎల్లయ్య గౌడ్, డివిజన్ ఆత్మ కమిటీ మెంబర్ చెన్నాడి శ్యామల, జిల్లా డిసిసి కార్యదర్శి వకుళభరణం శ్రీనివాస్, బాలసాని శ్రీనివాస్ గౌడ్, పార్టీ మండల నాయకులు చెన్నాడి గోవర్ధన్ రెడ్డి, చిలక ప్రభాకర్, మర్రిపల్లి మల్లేశం, ప్రజాప్రతినిధులు, హన్మాజీపేట గ్రామ ప్రజలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

# హరీష్ రావు ఫ్లెక్సీల తొలగింపు కాంగ్రెస్ అహంకారానికి నిదర్శనం



**: జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్**

**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** మాజీ మంత్రి హరీష్ రావుపై ప్రజల్లో పెరుగుతున్న అభిమానాన్ని తట్టుకోలేక కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని దుశ్చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ విమర్శించారు. అభిమానులు ఏర్పాటు చేసిన హరీష్ రావు ఫ్లెక్సీలను తొలగించడం కాంగ్రెస్ అహంకారానికి నిదర్శనమని అన్నారు. బుధవారం చిన్నకోడూరు మండలంలో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికార బలంతో బీఆర్ఎస్ పార్టీని, హరీష్ రావును లక్ష్యంగా చేసుకుని వ్యవహరిస్తోందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన నాయకుడిగా, తాగు మరియు సాగు నీటి ప్రాజెక్టుల ద్వారా ప్రజలకు సేవలందించిన నాయకుడిగా హరీష్ రావు ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఫ్లెక్సీలను తొలగించడం ద్వారా ప్రజల హృదయాల్లో ఉన్న అభిమానాన్ని చెరిపేయడం సాధ్యం కాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల పట్ల అనుసరిస్తున్న వైఖరికి ప్రజలు తగిన సమయంలో సమాధానం చెబుతారని హెచ్చరించారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ తన చర్యలకు రాజకీయంగా మూల్యం చెల్లించక తప్పదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిన్నింటి అబ్బిరెడ్డి, పానుగంటి రమేష్, రాచకొండ బిక్షపతి, బంక పోచయ్య, పెసరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లా ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యులు



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సభ్యులు బుధవారం సందర్శించారు. కమిటీ జాతీయ అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య సూచన మేరకు ఆసుపత్రికి వెళ్లిన సభ్యులు సూపరింటెండెంట్, ఇన్‌చార్జి డాక్టర్ జ్యోతిని కలిసి ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాల గురించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు సేకరించారు. వైద్య సేవలు, సౌకర్యాల పట్ల రోగులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి నెలా ప్రభుత్వాసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న సేవలు, సౌకర్యాలను పరిశీలిస్తూ వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా అధ్యక్షుడు నెమలి సుభాష్, ఉపాధ్యక్షులు జి. ప్రభూరాజ్, సంపత్, కార్తిక్ రెడ్డి, గౌరవ సలహాదారు బోయ రాములు, టౌన్ అధ్యక్షురాలు సునిత, ఉపాధ్యక్షుడు రాంగోపాల్, జాయింట్ సెక్రటరీ సుజాత, జనరల్ సెక్రటరీ వెంకటలక్ష్మి, రవి తదితరులు పాల్గొన్నారు.

# నిముషాల్లో ఇందిరమ్మ ఇల్లు మంజూరు

- పాదయాత్ర చేయడంతో కదిలిన అధికార యంత్రాంగం



**చట్టం బీబీపేట్ :** ఇందిరమ్మ ఇల్లు మంజూరు కోసం గత కొన్ని నెలలుగా అధికారుల చుట్టూ, నాయకుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో బాధిత కుటుంబం జిల్లా కలెక్టర్ దగ్గర మొర పెట్టుకోవడానికి ఏకంగా పాదయాత్రకు శ్రీకారం చుట్టడంతో విషయం తెలుసుకున్న జిల్లా అదనపు కలెక్టర్ జోక్యంతో నిముషాల్లో ఇల్లు మంజూరైన సంఘటన బుధవారం బీబీపేట్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రానికి చెందిన ఎలమైన నందిని ( బాధితురాలు )తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని మొదటి నుంచి దరకాస్తు చేసుకున్నారు. మంజూరుకు అన్ని రకాలుగా అర్హురాలుగా ఉన్నప్పటికీ మంజూరు చేయడం లేదని ఆమె వాపోతూ అధికారుల చుట్టూ, స్థానిక నాయకుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయిందని ఆమె ఆవేదన వ్యక్త పరుస్తూ జిల్లా కలెక్టర్ కు తమ గోడు వినిపించడానికి తమ కుటుంబ సభ్యులతో పాదయాత్ర ద్వారా కామారెడ్డికి బయలు దేరింది. సుమారు 10 కిలోమీటర్ల దూరం కాలి నడకన నడుస్తూ దోమకొండ మండల కేంద్రం వరకు చేరుకుంది. అంతలోనే పర్యటన లో ఉన్న అదనపు జిల్లా కలెక్టర్ కు సమాచారం అందడంతో వెంటనే బాధిత కుటుంబానికి ఇల్లు మంజూరు చేయడంతో మండల అధికార యంత్రాంగం హుటాహుటిన పరుగులు తీస్తూ బాధిత కుటుంబానికి ఇల్లు నిర్మాణం కోసం ముగ్గు కూడా పోయడంతో ఈ విషయం మండల కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో పలుమార్లు అధికారుల ,నాయకుల చుట్టూ తిరిగినా సాంకేతిక లోపాలున్నాయని నమ్మ పలికి కుంటి సాకులు చెప్పారని బాధితురాలు ఆరోపించారు. ఇలా అన్ని రకాలుగా అర్హతలున్న బాధితులు అనేక మంది ఉన్నారని, ఎంపిక చేయడంలో నిర్లక్ష్యం ,అలసత్వం వహించడంలో ఆంతర్యం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయని పలువురు వాపోతున్నారు. ఇందుకు కారణం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కమిటీ, అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని మరి కొందరు ఆరోపిస్తున్నారు.

# యావాపూర్ లో రెండు ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభోత్సవం



**చట్టం, తూప్రాన్;** తూప్రాన్ మండలం యావాపూర్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమం యావాపూర్ గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారుల నూతన గృహాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తూప్రాన్ మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) సతీష్, తూప్రాన్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సంతోష్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, నవీన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వెంకటేశం, సేతు లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పథకం కింద నిర్మించిన మూడు ఇందిరమ్మ ఇళ్లను ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రారంభించారు. లబ్ధిదారులు మన్నే విమలమ్మ, పొగాకు సంగీత, తిమ్మకపల్లి లక్ష్మిలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివాస సౌకర్యాల మెరుగుదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

# భూపతిపూర్‌లో షీ టీమ్ అవగాహన సదస్సు

- మహిళల భద్రత, సైబర్ మోసాలు, బాలల రక్షణపై అవగాహన
- వేధింపులు, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఫిర్యాదు చేయాలని సూచన



**చట్టం రామగుండం :** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు పెద్దపల్లి షీ టీమ్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ గ్రామంలో 100 రోజుల ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ సిబ్బంది మాట్లాడుతూ మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై మహిళలకు అవగాహన కల్పించారు. మహిళల భద్రత కోసం బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, విద్యాసంస్థల పరిసరాల్లో షీ టీమ్ నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తోందని తెలిపారు. ఎవరైనా మహిళలు లేదా విద్యార్థినులు వేధింపులకు గురైతే భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యను తెలియజేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. ప్రస్తుతం అనేక మంది అత్యాశకు లోనై సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, లోన్ యాప్‌ల బారిన పడుతున్నారని పేర్కొంటూ, అలాంటి మోసాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఒకవేళ ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు సమాచారం అందించాలని కోరారు. మహిళలు ఏదైనా ప్రమాదం, బెదిరింపులు లేదా అత్యవసర పరిస్థితులను ఎదుర్కొంటే వెంటనే 100 లేదా 112 నంబర్లకు డయల్ చేసి పోలీసుల సహాయం పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఆసియా బేగం, ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మి, షీ టీమ్ సభ్యులు సురేష్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణా.. ఇద్దరు అరెస్ట్, మరో ఇద్దరు పరారీలో



**చట్టం రామగుండం :** రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 748 గ్రాముల గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.37,500గా పోలీసులు అంచనా వేశారు. ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ పోలీసు సిబ్బందితో కలిసి బి పవర్ హౌస్ టర్నింగ్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న బోరే కిషన్ (26), లింగంపల్లి శ్రావణ్ కుమార్ (26)లను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు గంజాయిని కొనుగోలు చేసి కొంత వినియోగించడంతో పాటు మిగిలిన గంజాయిని ఎన్టీపీసీ ప్రాంతంలో కూలీ పనులు చేసే ఇతర రాష్ట్రాల కార్మికులకు విక్రయించేందుకు తీసుకువచ్చినట్లు ఒప్పుకున్నారు. పంచుల సమక్షంలో నిర్వహించిన తనిఖీల్లో వారి వద్ద ఉన్న బ్యాగులో 748 గ్రాముల గంజాయి లభ్యమైంది. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకుని నిందితులను పట్టుకున్న ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, పోలీసు సిబ్బందిని ఏసీపీ ఎం. రమేష్, సీఐ కృష్ణ కుమార్‌తో పాటు ఉన్నతాధికారులు అభినందించారు.

# నూతన జిల్లా విద్యాశాఖ అధికారికి ఎస్‌టీయూటీఎస్ ఘన సన్మానం



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వరగంటి శాస్త్రిని బుధవారం ఎస్‌టీయూటీఎస్ సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, జిల్లా విద్యాభివృద్ధికి విద్యాశాఖ అధికారులు సమర్థవంతంగా పనిచేసి ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మ్యాడ శ్రీధర్, ప్రధాన కార్యదర్శి పట్నం భూపాల్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మట్టపల్లి రంగారావు, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, దుబ్బాక మండల అధ్యక్షుడు కంతుల రాములు, దుబ్బాక మండల ఆర్థిక కార్యదర్శి బోడ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు: ఎమ్మెల్యే డా.ఆర్. భూపతి రెడ్డి

- కుటుంబ సమస్యల పరిష్కారానికి ఉచిత సలహా కేంద్రం దోహదం
- ఏ సమస్య పరిష్కారానికైనా ప్రతినిత్యం అందుబాటులో ఉంటా
- మహిళలపై హింసను నిర్మూలించేందుకు కృషి
- DRDA,మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభం
- ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి




**చట్టం, నిజామాబాద్ ప్రతినిధి :** సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న హింసను పారదోలేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటూ.. మహిళల రక్షణకు పెద్దపీట వేస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పేర్కొన్నారు. DRDA మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిజామాబాద్ రూరల్ మండలం పాంగ్రా మండల సమాఖ్య భవనంలో ఉచిత కుటుంబ సలహా కేంద్రం (జెండర్ రిసోర్స్ సెంటర్)ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయన్న తో కలిసి పాల్గొని.. రిబ్బన్ కట్ చేసి సలహా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం సలహా కేంద్రం ద్వార అందిస్తున్న సేవలను సంబంధిత అధికారులు వివరించారు. అటు మహిళ సమాఖ్య ప్రతినిధులు పలు సమస్యలు విన్నవించగా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే రాష్ట్రంలోని అత్యధికంగా మన రూరల్ నియోజకవర్గంలో 127 మహిళా భవనాలు ఇవ్వడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ... సమాజంలో పేరుకుపోయిన రుగ్మతలను నిర్మూలించడం తో పాటు..కుటుంబ సమస్యలు, గృహహింస సమస్యలు పరిష్కరించడంలో జెండర్ రిసోర్స్ సెంటర్ దోహదపడుతుందన్నారు. భార్య భర్తల మధ్యన తలెత్తే గొడవలు, కుటుంబ సమస్యలు, బాలకార్మిక తదితర సామాజిక సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రం సహాయంగా ఉంటుందన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ.. సలహా కేంద్రాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతినిత్యం మహిళల రక్షణార్థం పోలీసు వ్యవస్థను పటిష్టం చేసి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా మహిళలను ఆర్థికకంగా, స్వయంచాలకంగా ఎదిగేందుకు ప్రభుత్వం వడ్డీలేని ఋణాలని అందిస్తూ.. మహిళా సాధికారతకు పాటుపడుతుందన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న వాటి పరిష్కారానికి ప్రతినిత్యం అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గీతా పారిశ్రామిక కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాయరెడ్డి, ఫిషరీస్ బోర్గం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉమ్మాజి నరేష్, మోపాల్ సాయరెడ్డి, జలందర్ రెడ్డి, హన్మండ్లు, కుమార్ రెడ్డి, మోహన్, వినోద్, పోశెట్టి, డీపీఎంలు నీలిమ, వెంకటేశ్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సునీత, సభ్యులు విజయ, స్వప్న, ఏపీఎం సరళ, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తూప్రాన్ లో ఘనంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి
- నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి




**చట్టం, తూప్రాన్;** మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలు తూప్రాన్ మున్సిపల్ పట్టణంలోని శభాష్ చంద్రబోస్ వద్ద స్థానిక బిఆరెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి, గజ్వేల్ ఇన్చార్జి వంటేరు ప్రతాపరెడ్డిలు హాజరయ్యారు. అనంతరం బిఆరెస్ నాయకులు , కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం సుభాష్ చంద్రబోస్ వద్ద బర్త్ డే సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బొంది రజిని, బిఆరెస్ మండల అధ్యక్షులు బొల్లెంపల్లి బాబుల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు బైరం సత్యలింగం, రాథోడ్ జైపాల్ నాయక్, ఐలేష్ యాదవ్, మరియు బి.ఆర్.ఎస్ నాయకులు షేక్ సత్తర్, ఏర్పుల లక్ష్మణ్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వమే బలమైన వేదిక



**చట్టం కథలాపూర్ :** గ్రామాల సమగ్ర అభివృద్ధి ప్రజా ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం కథలాపూర్ మండలంలోని తండ్రియాల, దూలూరు, గంభీర్‌పూర్ గ్రామాల్లో పలు కుల సంఘాలకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను పంపిణీ చేశారు. అనంతరం తండ్రియాలలో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన వస్త్రాలను అందజేశారు. తదుపరి బొమ్మెన గ్రామంలో జరిగిన పెద్దమ్మతల్లి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాస సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కుల సంఘాల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు గాయత్రి నాగరాజ్, చెదల సత్తన్న, పులి హరిప్రసాద్, అజీమ్, క్యాతం సంజీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గణేష్ బిగాల



**నిజామాబాద్, చట్టం న్యూస్:** మాజీ మంత్రి, సిద్దిపేట్ ఎమ్మెల్యే హరీష్ రావు జన్మదినం సందర్భంగా నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం, అభివృద్ధి పట్ల అంకితభావంతో పనిచేస్తూ తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన హరీష్ రావు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధికి ఆయన అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్న గణేష్ బిగాల, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## జూన్ 9లోగా దరఖాస్తు చేసుకోండి

- ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లు, ఆయాల పోస్టులకు నోటిఫికేషన్



**చట్టం రామగుండం :** పెద్దపల్లి జిల్లాలో 202627 విద్యా సంవత్సరానికి 48 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నూతనంగా ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించనున్నట్లు జిల్లా విద్యాశాఖ కార్యాలయం ప్రకటించింది. ఈ పాఠశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన 10 నెలల గౌరవ వేతనంతో ప్రీప్రైమరీ ఇన్స్ట్రక్టర్లు, ఆయాల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ప్రీప్రైమరీ ఇన్స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ (10+2) లేదా దానికి సమానమైన అర్హత ఉండాలి. ప్రారంభ బాల్య విద్య లేదా ప్రాథమిక బోధనలో అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఆయా పోస్టుకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఎంపిక ప్రక్రియలో సంబంధిత ప్రీప్రైమరీ పాఠశాల ఉన్న ఆవాసం, అదే గ్రామ పంచాయతీ, అదే మండలం, అదే జిల్లా అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పించనున్నారు. నోటిఫికేషన్ తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, మాజీ సైనికులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల వయో సడలింపు వర్తిస్తుంది. అర్హత కలిగిన అభ్యర్థులు విద్యార్హత, వయస్సు, నివాస ధృవీకరణ తదితర సంబంధిత సర్టిఫికెట్ల ప్రతులతో కూడిన దరఖాస్తులను సంబంధిత ప్రీప్రైమరీ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు జూన్ 9 సాయంత్రంలోగా సమర్పించాలి. ప్రీప్రైమరీ విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేపట్టిన ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ సూచించింది.

## చెరువులో చేపల మృతి



**చట్టం పోతంగల్/కోటగిరి:** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని ఓల్డ్ జల్లపల్లి చెరువులో వందల చేపలు చనిపోయి తేలుతున్నాయి. గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని నీటిలో చనిపోయిన చేపల నమూనలను సేకరించారు. గంగపుత్ర సంఘం అధ్యక్షుడు మేత్రి పెద్ద భూమయ్య, సెక్రెటరీ శ్రీ గంధం పోశెట్టి, తెలిపిన విషయం ప్రకారం 9 టన్నుల నుండి 10 టన్నుల మధ్యలో చేపలు చనిపోయాయని తెలిపారు. గంగపుత్రులు కన్నీరు మున్నేరు అవుతున్నారు విష ప్రయోగాన్ని చేసిన వారిని వెంటనే పట్టుకోమని శిక్షించాలని పోలీసులను కోరడం జరిగింది.

## రామగుండం సింగరేణి రీజియన్‌లో గని కార్మికుల క్వార్టర్లపై అక్రమ ఆక్రమణలు

- అసలైన కార్మికులకు క్వార్టర్ల కేటాయింపులో జాప్యం.. అక్రమదారుల దౌర్జన్యాలపై ఆందోళన
- రామగుండం సింగరేణి రీజియన్లలో దౌర్జన్యకారులకు గురవుతున్న
- గని కార్మికుల క్వాటర్లపై ప్రత్యేక ఫోకస్



**చట్టం రామగుండం :** రామగుండం సింగరేణి రీజియన్ లోని ఆర్ జి వన్, అర్జీ టు, అర్జీ త్రి, డివిజన్లో పనిచేస్తున్న గని కార్మికుల కోసం గని కార్మికుల సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా వారికి క్వార్టర్లు సింగరేణి యాజమాన్యం నిర్మాణం చేసి ఇస్తున్న విషయం తెలిసిందే. గత అనేక సంవత్సరాల నుండి కొనసాగుతున్న ఈ పద్ధతికి రాను రాను సంబంధిత అధికారులు కార్మిక నాయకులు పైరవీ కారులు తూట్లు పొడుస్తూ వారికి నచ్చిన క్వార్టర్లను ఆక్రమించుకుంటూ సంక్షేమం కోసం పోరాటం చేసే కార్మిక సంఘాల నాయకులు సైతం వారి కార్యాలయాల కోసం అలాగే వారు ఎంజాయ్మెంట్ ఎంటర్టైన్మెంట్ చేయడం కోసం ఖాళీగా ఉన్న క్వాటర్లను ఆక్రమించుకొని తాగడానికి క్లబ్బులకు అన్నింటికి ఉపయోగించుకుంటున్న తీరు ఈ మూడు డివిజన్లో కొట్టొచ్చినట్టుగా కనిపిస్తున్నాయి. ఇందుకు నిదర్శనం గోదావరిఖని ఏరియా లోని తిలక్ నగర్ విట్టల్ నగర్ డౌన్లో ఉండే సింగరేణి క్వార్టర్లలో ఒక్కసారి అధికారులు కానీ సింగరేణి విజిలెన్స్ డిపార్ట్మెంట్ గాని ఆకస్మికంగా తనిఖీలు చేస్తే వాటిల్లో ఎంతమంది కార్మికేతరులు ఉన్నారు.ఎంతమంది పైరవీ కారులు ఉన్నారు ఎంతమంది యూనియన్ నాయకులం అని చెప్పుకొని క్లబ్బుల పేరుతో పేకాటల పేరుతో మందు తాగుతూ చుట్టుపక్కల ఉండే అసలైన గని కార్మికులకు ఎంత ఇబ్బంది కల్పిస్తున్నారు తెలుస్తుంది అంటూ కార్మికులు ఆరోపిస్తున్నారు. ఇక అర్జీ టు పరిధిలోని ఎనిమిదవ కాలనీలో మార్కెట్ ఏరియా టిటు, ఎస్టి టు క్వార్టర్స్ ఏరియా మిలీనియం క్వార్టర్స్ ఏరియాలలో ఈ అక్రమదారుల ఆక్రమణలకు వందలాది క్వార్టర్స్ గురైపోయి చుట్టుపక్కల ఉన్న వాళ్ళు అడుగుతే దౌర్జన్యాలు చేస్తున్న తీరు కూడా కండ్లకొద్దినట్టుగా కనిపిస్తున్నాయి.ఈ విషయాలలో చుట్టుపక్కల క్వార్టర్స్ వాళ్ళు ఇతర సంఘాల నాయకులు సైతం ఈ యజమాన్యాలకు జీఎం కార్యాలయాల్లో ఫిర్యాదులు చేసిన మా దృష్టికి ఏమి రాలేదు మేము చర్యలు తీసుకుంటున్నామని అంటున్నారే గాని ఏ ఒక్క దగ్గర కూడా చర్యలు తీసుకోకపోగా వారితో వీరు కూడా కలిసి తమ సహకారంతో వారికే మద్దతిస్తున్నారని జాతీయ కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. మరి ఈ దౌర్జన్యకర పరిస్థితికి వీరికి ఇంత ధైర్యం ఎక్కడి నుండి వస్తుందా అనే విషయంపై ఒకసారి ఆరాధిస్తే వీరి వెనుక గుర్తింపు సంఘాల నాయకులు అలాగే జీఎం కార్యాలయాల్లో పనిచేసే పర్సన్ డిపార్ట్మెంట్ అధికారులు ప్రోత్సహిస్తున్నారు అంటూ ఆ కార్మిక సంఘాల నాయకులు బాహాటంగా విమర్శిస్తున్నారు. ఓపెన్ కాస్ట్ గనుల కింద పోయిన గ్రామాలలో ఇల్లు కోల్పోయిన వారికి విట్టల్ నగర్ తిలక్ నగర్ ఏరియాలో వారికి పర్మనెంట్ ఇల్లు నిర్మాణం చేసుకునే వరకు ఈ క్వార్టర్ ను కేటాయించగా అందులో ఉండే వారు గుంపులు గుంపులుగా ఏర్పడి రోడ్లపైనే బాహాటంగా తాగుతూ వచ్చి పోయే వాళ్లను విమర్శిస్తూ కేరింతలు కొడుతూ ఇతరులకు ఇబ్బంది కలిగిస్తావుంటే వారు వెళ్లి అడిగితే దౌర్జన్యం చేస్తున్నాడే కానీ వారికి సపోర్ట్ చేయడం లేదని ఆరోపణలు ఈ రెండు ఏరియాలలో పర్మనెంట్ గా ఉంటున్న కార్మికులు భయాందోళనతో వ్యక్తం చేస్తున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో సింగరేణి యాజమాన్యం ఎందుకు విజిలెన్స్ డిపార్ట్మెంట్ ద్వారా ఆకస్మిక దాడులు చేసి వారి పైన చర్యలు ఎందుకు తీసుకుంట లేదో కార్మిక వర్గానికి తెలిపాలంటూ కార్మిక సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ఇంత జరిగినా స్పందించకుంటే తప్పకుండా కార్మిక సంఘాల నాయకులమైన మేము కొంతమంది ఆయా ప్రాంతాలకు వెళ్లి విచారణ జరిపి నేరుగా చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

## పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఫైర్

- తెలంగాణపై ప్రేమ ఇప్పుడు గుర్తొచ్చిందా?



**చట్టం పెద్దపల్లి :** తెలంగాణకు న్యాయం చేస్తామని, తెలంగాణ కోసం గొంతెత్తుతామని పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, యువత, ప్రజలు ప్రాణత్యాగాలు చేసినప్పుడు, తెలంగాణను అవమానించే వ్యాఖ్యలు వచ్చినప్పుడు, రాష్ట్ర హక్కులను కాలరాసే ప్రయత్నాలు జరిగినప్పుడు పవన్ కళ్యాణ్ ఎక్కడ ఉన్నారని ఆయన ప్రశ్నించారు. తెలంగాణను అవమానించిన వారితోనే రాజకీయ పొత్తులు పెట్టుకుని, తెలంగాణకు అన్యాయం చేసిన శక్తులతోనే కలిసి నడుస్తూ, ఇప్పుడు తెలంగాణపై ప్రేమ చూపించడం ప్రజలను మోసం చేసే రాజకీయ నాటకమని విమర్శించారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణను పాకిస్తాన్‌తో పోల్చినప్పుడు పవన్ కళ్యాణ్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. తెలంగాణ యువత, తెలంగాణ ఆత్మగౌరవం అవమానించబడిన ప్రతి సందర్భంలో మౌనం పాటించిన వ్యక్తి ఇప్పుడు తెలంగాణకు రక్షకుడిలా మాట్లాడటం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. "తెలంగాణ కోసం పోరాడింది కాంగ్రెస్ పార్టీ... తెలంగాణను ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ... తెలంగాణ హక్కులను కాపాడేది కూడా కాంగ్రెస్ పార్టీయే" అని ఎంపీ వంశీకృష్ణ స్పష్టం చేశారు. పదవుల కోసం, రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ పేరు ఉపయోగించే వారిని తెలంగాణ ప్రజలు ఎన్నడూ నమ్మరని, మాటలు కాదు చేతలే ముఖ్యం అని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ పార్టీ రాజీపడదని, తెలంగాణ హక్కుల కోసం ఎప్పటికీ ముందుండి పోరాడుతుందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు.

## ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా బండ శ్రీనివాస్‌కు ఘన సన్మానం



**చట్టం, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వేములవాడ రూరల్ మండలంలోని హనుమాజీపేట గ్రామంలో ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన బండ శ్రీనివాస్‌కు గ్రామ ప్రజలు ఘన సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రజలకు, రైతులకు నిజమైన స్వేచ్ఛ, అభివృద్ధి అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. రైతుల పట్ల ప్రభుత్వం అండగా నిలుస్తోందని, పండించిన పంటలను స్వేచ్ఛగా విక్రయించుకునే పరిస్థితులను కల్పించిందని అన్నారు. రైతులు ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తుంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు సోయినేని కరుణాకర్, బొడ్డు రాములు, చిలుక ప్రభాకర్, రోమాల జగదీశ్వర్, తిరుపతి రెడ్డి, వకలాభరణం శ్రీనివాస్, హనుమాజీపేట మార్కెట్ డైరెక్టర్ స్రవంతి హరినందన్, చింతలకోటి రాజు, అదిల్ బాషా, బొల్లారం బాలసాని శ్రీనివాస్ గౌడ్, ఆత్మీయ కమిటీ డైరెక్టర్ శ్యామల గోవర్ధన్ రెడ్డి, హనుమాజీపేట కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన ఉపసర్పంచ్ అవునూరి శంకరమ్మ, శంకరయ్య, వార్డు సభ్యులు కోరం రవి, గొర్రె నర్సవ్వ, అవునూరి కార్తీక్‌తో పాటు ఇతర వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై పార్టీకి కట్టుబడి పనిచేస్తామని హామీ ఇచ్చారు.

## మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే T.హరీష్ రావు జన్మదిన వేడుకలను సిద్దిపేట పట్టణంలోని 36వ వార్డులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దరిపల్లి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మున్సిపల్ చైర్మన్ కడవేరుగు రాజానర్సు, మచ్చ వేణుగోపాల్, సిద్దిపేట పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి, చిప్ప ప్రభాకర్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు భోజనాలు వడ్డించారు. హరీష్ రావు ప్రజా సేవలో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉత్సాహభరిత వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేశాయి.

## తన్నీరు హరీష్‌రావు పుట్టినరోజు సందర్భంగా మార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** తన్నీరు హరీష్‌రావు పుట్టిన రోజు సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయురారోగ్యాలతో, ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ పద్మశాలి సమాజం అధ్యక్షుడు కాముని రాజేశం, ఉపాధ్యక్షుడు పెద్ది అశోక్, ప్రధాన కార్యదర్శి అంబులెన్స్ బాలరాజ్, కార్యవర్గ సభ్యులు పెద్ది శ్రీనివాస్, వీరబత్తిని నగేష్, దీకొండ మహేష్, రాజేందర్, యువజన సంఘం అధ్యక్షుడు మురళీ, మున్నా సాయి, కాముని నగేశ్, అరగొండ మల్లేశం, మేనేజర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు. పూజల అనంతరం హరీష్‌రావు ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది.

## మేమున్నామంటూ మిత్రుల చేయూత.!



**చట్టం శంకరపట్నం :** శంకరపట్నం మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన ఇజ్జిగిరి మొగిలి తండ్రి పుల్లయ్య ఇటీవల మరణించినారు. దీనికిగాను బుధవారం రోజున మొగిలి పదవ తరగతి స్నేహితులు వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించి ఆపదలో ఉన్న స్నేహితునికి మేమున్నామంటూ, మనోధైర్యం కల్పించి తమ వంతుగా 11 వేల రూపాయల ఆర్థిక సహాయం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మృతుడి కుటుంబ సభ్యులతో పాటు మొగిలి పదవ తరగతి మిత్రబృందం తదితరులు పాల్గొన్నారు.

## జనహృదయ నేతకు ఘనంగా జన్మదిన వేడుకలు



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి, మలిదశ తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు జన్మదిన వేడుకలను సిద్దిపేట పట్టణంలోని 23వ వార్డులో రైతు బజార్ సమీపంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఉదయం 8:20 గంటలకు నిర్వహించిన కార్యక్రమంలో వార్డు ప్రజలు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "హ్యాపీ బర్త్‌డే హరీష్ రావు" అంటూ నినాదాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అబ్బోజి దయాకర్, కృష్ణ, డి. ప్రకాష్, మునిగళ్ల బాలరాజ్, నాయకం కరుణాకర్, దొడ్డ లచ్చయ్య, కోటగిరి ప్రసాద్, కాపర్తి నరేష్, గోపిశెట్టి శ్రీధర్, కాపర్తి కాశీనాథం, పోచయ్యతో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## కేజీబీవీలో ఇంటర్మీడియట్ ప్రవేశ దరఖాస్తులు స్వీకరణ



**చట్టం రెంజల్ :** రెంజల్ మండల కేంద్రంలో జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు కస్తూర్బా గాంధీ బాలికల కళాశాలలో 2026 27 సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ బైపిసి ఇంగ్లీష్ మీడియం లో విద్యాభ్యాసం అభ్యసించడానికి ప్రవేశ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కస్తూర్బా గాంధీ కళాశాల ప్రత్యేక అధికారి బి. శ్యామల తెలిపారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ కళాశాల ప్రత్యేక అధికారి బి. శ్యామల మాట్లాడుతూ నూతనంగా 40 సీట్లతో ప్రారంభించబోతున్న బైపిసి ఇంగ్లీష్ మీడియం లో ప్రవేశం చేరాలనుకునే ఉత్సాహం కలిగిన విద్యార్థినిలు సంబంధిత విద్యార్హతలు ఎస్ ఎస్ సి సర్టిఫికెట్, ఆధార్ కార్డు, కులం సర్టిఫికెట్, ఆదాయ సర్టిఫికెట్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో ఈ నెల 12వ తేదీ లోపు కస్తూర్బా గాంధీ బాలికల కళాశాలను సంప్రదించి దరఖాస్తు సమర్పించుకోవాలని కళాశాల ప్రత్యేక అధికారి బి. శ్యామల కోరారు. కస్తూర్బా గాంధీ కళాశాలలో నూతనంగా ప్రారంభం కానున్న బైపీస్ ఇంగ్లీష్ మీడియం ప్రవేశం పొంది విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


## ప్రభుత్వ గుర్తింపు ఉన్న పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలి

- మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి



**చట్టం బిచ్కుంద ;** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండలంలోని విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయునది ఏమనగా ప్రభుత్వ గుర్తింపు ఉన్న పాఠశాలలోనే మీ పిల్లలను చేర్పించాలి. గుర్తింపు లేని పాఠశాలలో చేర్పించకూడదు అని తెలియజేస్తున్నాను. బిచ్కుంద మండలంలోని NEW ORCHILDS SCHOOL కు ఇప్పటివరకు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు పర్మిషన్స్ మరియు రికగ్నిషన్స్ ఏమియు లేవు కావున అందులో మీ పిల్లలను చేర్పించకూడదు. ఎంఈఓ ఒక ప్రకటనలో తెలిపారు అదేవిధంగా బిచ్కుంద మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలో యాజమాన్యాలకు ప్రధానోపాధ్యాయులకు తెలియజేయునది ఏమనగా మీ మీ పాఠశాలలో నోట్ బుక్స్ బుక్స్ గాని విక్రయించకూడదు అలాంటివి ఏమైనా విక్రయించినట్లు ఫిర్యాది వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బిచ్కుంద మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు

## ప్రభుత్వ పథకాలను తెలిపేందుకు ప్రత్యేక వార్డు సభలు



**చట్టం రామకృష్ణాపూర్:** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా క్యాతనపల్లి పుర పరిధిలో ప్రత్యేక వార్డు సభలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడమే లక్ష్యంగా జూన్ 4,6,8,10 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి వార్డ్ సభలు నిర్వహించనున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 4వ తేదీన 1,2,3,5,9,15వ వార్డులలో, జూన్ 6వ తేదీన 4,6,10,11,13,22వ వార్డులలో, జూన్ 8వ తేదీన 7,12,14,17,19వ వార్డులలో, జూన్ 10వ తేదీన 8,16,18,20,21వ వార్డులలోని పలు ప్రాంతాల్లో వార్డ్ సభలు జరగనున్నాయని తెలిపారు. ఆయా వార్డుల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రభుత్వ పథకాలపై అవగాహన పొందడంతో పాటు స్థానిక సమస్యలను, తమ అర్జీలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

# ప్రతీ ఒక్కరు సైకిల్ తొక్కాలి



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** బరువు తగ్గాలనుకునే వారికి సైక్లింగ్ ఒక మంచి వ్యాయామం అని మాజీ ఎం ఈ ఓ పాశం సంజీవ రెడ్డి అన్నారు ప్రపంచ సైకిల్ దినం సందర్భంగా కాకతీయ యూనివర్సిటీలో లో సైకిల్ తొక్కుతూ మాట్లాడుతూ సైకిలింగ్ జీవక్రియ రేటును మెరుగుపరుస్తుందని కండరాలను పెంచుతుందని శరీరంలో కొవ్వును కరిగిస్తుంది. బరువు తగ్గాలనుకుంటే.. మీ రొటీన్‌లో సైక్లింగ్‌ను కచ్చితంగా చేర్చుకోవాలని అన్నారు వ్యాయామం ద్వారా వారానికి కనీసం 2,000 కేలరీలు బర్న్ చేయాలని పరిశోధనలు సూచిస్తున్నాయని స్థిరమైన సైక్లింగ్ గంటకు సుమారు 300 కేలరీలు బర్న్ చేస్తుంది. సైక్లింగ్ బరువును కంట్రోల్‌లో ఉంచుతుందని బ్రిటీష్ పరిశోధన ప్రకారం, ప్రతిరోజూ అరగంట సైకిల్ తొక్కితే.. ఒక ఏడాదిలో దాదాపు ఐదు కిలోల కొవ్వును కరిగిస్తుందని ప్రతీ ఒక్కరు సైకిల్ కొనుగోలు చేసి కాలుష్యాన్ని తగ్గించాలని కోరారు. పెరుగుతున్న పెట్రోల్ ధరలను చూస్తే సైకిల్ మాత్రమే మంచి సాధనం అన్నారు. కార్యక్రమం లో గోపాల్ పూర్ వాకర్స్ గౌరవ అధ్య క్షులు కామిడి సతీష్ రెడ్డి లింగంపల్లి నర్సింగ రావు, ఓం బ్రహ్మం పాల్గొన్నారు

# మాసాయిపేటలో ఘనంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు



**చట్టం మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో సిద్ధిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాసాయిపేటలో కేక్ కట్ చేసి జన్మదినోత్సవాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు హరీష్ రావు తెలంగాణ అభివృద్ధికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా రైతాంగ సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధిలో ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ వేడుకల్లో చెట్ల తిమ్మాయపల్లి మాజీ సర్పంచ్ మోహన్ రాథోడ్, నడిమితండా మాజీ సర్పంచ్ స్వాతి, శ్రీనివాస్, బీఆర్ఎస్ యూత్ నాయకుడు పవన్, సీనియర్ నాయకులు రాములు, చంద్రం గౌడ్, నడిమితండా మాజీ ఉపసర్పంచ్ రవీందర్, తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గుడ్డి కృష్ణ మాదిగ, వార్డు సభ్యులు సాగర్, శ్రీనివాస్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా టూరిజం హబ్ గా మార్చడమే లక్ష్యం

- **రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**చట్టం న్యూస్, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా టూరిజం హబ్ గా మార్చడమే లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలో తిప్పాపూర్ లో మూడవ బ్రిడ్జి స్లాబ్ పనులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.. వారు మాట్లాడుతూ వేములవాడ రాజన్న ఆలయ సన్నిధిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో , జిల్లా మంత్రుల సహకారంతో , జిల్లా అధికారుల సమన్వయంతో రాజన్న ఆలయంతో పాటు వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నాం అన్నారు.. ఇప్పటికే 150 కోట్లు విడుదల చేసుకొని రాజన్న ఆలయ అభివృద్ధి పనులను శిరవేయంగా కొనసాగుతున్నాయని అన్నారు.. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శిలాఫలకలకే పరిమితమై వారిచ్చిన వాగ్దానాలన్నీ నీటి మూటలు అయ్యాయని అన్నారు.. 2015 లో మూడో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు చేయడం మరిచిపోయారని ఎద్దేవ చేశారు.. కనీసం భూసేకరణ చేయకుండా వారు కేవలం వారు ప్రజలను మభ్య పెట్టారని అన్నారు.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడో బ్రిడ్జి భూసేకరణ కోసం 6 కోట్ల 97 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు... గత ప్రభుత్వం హయంలో వారు కేవలం ఓట్లు దండుకోవడానికి మాత్రమే శిలాఫలకాలు వేశారని అభివృద్ధి చేయడానికి ఏమాత్రం కాదన్నారు.. దానికి సజీవ సాక్షాలుగా తిప్పాపూర్ మూడవ బ్రిడ్జి కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు పనులకు భూసేకరణ చేయకుండా కేవలం శిలాఫలకాలే వేశారని తెలిపారు.. ప్రాజెక్టు నిర్మాణానికి ప్రజా ప్రభుత్వంలో భూసేకరణకు నిధులు విడుదల చేసి భూ సేకరణ చేయడం జరిగిందన్నారు... ఇప్పటికి ప్రాజెక్టు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి అన్నారు.. రాజన్న ఆలయం ముందు నుంచి తిప్పాపూర్ బ్రిడ్జి వరకు 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని త్వరలోనే లైటింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. సుమారు 1000 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు..బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్మాణాలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు

## ప్రజల పక్షాన నిలిచే నాయకుడు హరీశ్ రావు: బీఆర్ఎస్ నేతల ప్రశంసలు

- **మాజీ మంత్రి హరీశ్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ**
- **దౌల్తాబాద్ చౌరస్తాలో కేక్ కట్ చేసి సంబరాలు**
- **ప్రజాసేవలో మరెన్నో ఏళ్లు కొనసాగాలని ఆకాంక్ష**



**చట్టం మెదక్ ప్రతినిధి :** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే T.హరీశ్ రావు జన్మదిన వేడుకలను బుధవారం హత్నూర మండలంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ ఆధ్వర్యంలో దౌల్తాబాద్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హరీశ్ రావు ప్రజా సమస్యలపై వెంటనే స్పందించే నాయకుడిగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. సమర్థవంతమైన నాయకత్వం, అంకితభావం, ప్రజాసేవ పట్ల నిబద్ధతతో హరీశ్ రావు ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వామి అవుతున్న నాయకుడిగా ఆయన నిలిచారని అన్నారు. దేవుడు ఆయురారోగ్యాలు ప్రసాదించి, మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, శివశంకర్ రావు, నరసింహారెడ్డి, వావిలాల నరసింహులు, అంబటి అర్జున్, కృష్ణ, ఆగమయ్య, మల్లేష్, మచ్చ నరేందర్, మాణిక్యరెడ్డి, మధు, కిషోర్, శేఖర్, అజ్జు, శంకర్, సురేందర్ రెడ్డి, రాజుతో పాటు పలువురు మాజీ సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో డిగ్రీ విద్యార్థి మృతి

- **వెంచర్ లో వాటర్ ట్యాంకు వద్ద మృతి**
- **హత్యా? ఆత్మహత్యా? అనే కోణంలో పోలీసుల దర్యాప్తు**



**చట్టం, తూప్రాన్;** అనుమానాస్పద స్థితిలో డిగ్రీ విద్యార్థి మృతి చెందిన సంఘటన తూప్రాన్ మున్సిపాలిటీ లో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తూప్రాన్ ఎస్.ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ పట్టణంలో నివాసం ఉంటున్న మహ్మద్ షరీఫ్ అహ్మద్ నసియా బేగం లకు ముగ్గురు సంతానం ఒక కూతురు, ఇద్దరు కుమారులు. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న పెద్ద కుమారుడు అబ్బు హిజిపా (21) తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ వెంచర్ లో వాటర్ ట్యాంక్ వద్ద తాడుతో ఉరివేసుకొని అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. తమ కుమారుడు అబ్బు హిజిపా జూన్ 2వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుండి వెళ్లాడని రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చినట్లు తెలిపారు. బుధవారం రోజు వెంచర్లో మగ వ్యక్తి ఉరివేసుకొని ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి చూశారు. మృతి చెందిన యువకుడు తమ కుమారుడే అని తెలువడంతో పోలీసులకు సమాచారం అందించారు. అబ్బు హిజిపాది ఆత్మహత్య కాదని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరణ చేసారా? అని కుటుంబ సభ్యుల అనుమానంతో కుటుంబ సభ్యులు తండ్రి మహ్మద్ షరీఫ్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యా? ఆత్మహత్యా? అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సులువుగా వెళ్లేలా వీధులను విశాలపరచాలి

- **ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



**చట్టం రామగుండం :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్వహిస్తున్న వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా 27వ డివిజన్‌లోని ముబారక్‌నగర్, విద్యుత్‌నగర్ సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, పెద్దపల్లి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె. అరుణశ్రీతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానిక కార్పొరేటర్ ఆయేషా ఖానమ్ వాజీద్ ఖాన్ డివిజన్‌లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా కాలువల పూడికతీత, పిచ్చి చెట్లు, ముళ్ల పొదల తొలగింపు పనులను పరిశీలించిన అధికారులు ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు సులభంగా వెళ్లేలా వీధులను విశాలపరచాలని, ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. వర్షాకాలంలో వరద ప్రభావానికి గురయ్యే రామగుండం మేజర్ నాలాలో ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో పూడిక తొలగింపు పనులు చేపట్టాలని సూచించారు. మందకొడిగా సాగుతున్న డ్రెయిన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, కొత్త ఎస్సీ వసతి గృహ భవనం నిర్మాణానికి అడ్డుగా ఉన్న శిథిల భవనాన్ని తొలగించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాల భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. అలాగే పవర్ హౌస్ జంక్షన్‌ను విశాలంగా, అందంగా అభివృద్ధి చేయాలని, కొత్త బస్ స్టాప్ నిర్మాణంతో పాటు స్వశక్తి మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇసంపెల్లి అంజయ్య, సిరిశెట్టి సతీష్, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, టీపీఎస్ నవీన్, ఏఈ తేజస్విని, శానిటరీ జవాన్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.


# సింగరేణిలో గోల్డెన్ షేక్ హ్యాండ్ పథకం అమలు చేయాలి

- **సీఎం కు వినతి పత్రం సమర్పించిన తుంగపిండి ఆనంద వర్ధన్**



**చట్టం రామగుండం :** సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు పెంచే దిశగా గోల్డెన్ షేక్ హ్యాండ్ పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుంగపిండి ఆనంద వర్ధన్ ముఖ్యమంత్రి కి వినతి పత్రం సమర్పించారు. వినతి పత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం ప్రస్తుతం సింగరేణి సంస్థలో పదవీ విరమణకు దగ్గరలో ఉన్న అనేక మంది సీనియర్ కార్మికులు అధిక బేసిక్ వేతనాలు, అలవెన్సులు మరియు ఇతర సౌకర్యాలు పొందుతున్నారని తెలిపారు. వీరికి ప్రతి నెలా భారీ మొత్తంలో జీతభత్యాలు చెల్లించాల్సి రావడం వల్ల సంస్థపై గణనీయమైన ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛంద పదవీ విరమణకు ప్రోత్సాహకంగా "గోల్డెన్ షేక్ హ్యాండ్" పథకాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ పథకం ద్వారా సీనియర్ కార్మికులకు గౌరవప్రదంగా ఒకేసారి ఆకర్షణీయమైన ఆర్థిక ప్యాకేజీ అందించడం ద్వారా వారి కుటుంబ భవిష్యత్తుకు భరోసా కలుగుతుందని తెలిపారు. అదే సమయంలో ఖాళీ అయ్యే ఉద్యోగాలలో యువ కార్మికులను నియమించడం ద్వారా తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన యువశక్తి సింగరేణిలోకి రావడం వల్ల ఉత్పాదకత మరియు పనితీరు మెరుగుపడటంతో పాటు సంస్థ వేతన వ్యయం కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. దీని ద్వారా నిరుద్యోగ సమస్య కొంత మేర తగ్గి సంస్థ దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వాన్ని సాధించగలదని అభిప్రాయపడ్డారు.అవసరమైతే సీనియర్ కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1 కోటి వరకు ప్రత్యేక ప్యాకేజీ రూపొందించి స్వచ్ఛందంగా పథకంలో చేరే అవకాశాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ప్రభుత్వం మరియు సింగరేణి యాజమాన్యం సంయుక్తంగా ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి గోల్డెన్ షేక్ హ్యాండ్ పథకాన్ని తిరిగి ప్రారంభించి కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన శాలివాహన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



**చట్టం సిద్దిపేట, ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా శాలివాహన (ప్రజాపతి) ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య సమావేశంలో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులై ప్రతిభ కనబరిచిన శాలివాహన (కుమ్మర/ప్రజాపతి) విద్యార్థులకు "ప్రతిభా పురస్కారాలు" అందించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, ఇటీవల వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచిన శాలివాహన (ప్రజాపతి) విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. సిద్దిపేట జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల వివరాలను సేకరించి, వారికి ఘనంగా సన్మానం చేయనున్నట్లు వెల్లడించారు. సిద్దిపేట జిల్లాలో నివసిస్తూ తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ చదివినా ప్రభుత్వ లేదా ప్రైవేట్ పాఠశాలలకు చెందిన శాలివాహన (ప్రజాపతి) విద్యార్థుల వివరాలను సంబంధిత నిర్వాహకులకు వాట్సాప్ ద్వారా పంపించాలని కోరారు. విద్యార్థుల పేరు, తల్లిదండ్రుల పేర్లు, పూర్తి చిరునామా, గ్రామం, మండలం, పాఠశాల పేరు, సాధించిన మార్కులు, మెమో కాపీ, ఫోటో మరియు మొబైల్ నంబర్ వివరాలను 12062026 శుక్రవారం సాయంత్రం లోపు పంపించాలని తెలిపారు. ప్రతిభా పురస్కారాల సన్మాన కార్యక్రమం 14062026 (ఆదివారం) మధ్యాహ్నం: 2.00 గంటలకు సిద్దిపేటలోని ప్రెస్ క్లబ్ (గాంధీ విగ్రహం సమీపంలో) నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లా కుమ్మర ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు కార్యక్రమానికి సంబంధించిన పూర్తి సమాచారం ఫోన్ ద్వారా వ్యక్తిగతంగా అందజేయబడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో శాలివాహన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దరిపల్లి నగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి దుర్గయ్య, గౌరవ అధ్యక్షులు రాములు, రాష్ట్ర నాయకులు రహదారి నాగరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ రామచంద్రము, ప్రతిభా పురస్కాల ఇన్చార్జ్ లు రవి, వెంకట్ , లక్ష్మణ్ , శ్రీనివాస్ ,తదితరులు పాల్గొన్నారు.
పూర్తి వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు:
ఆంజనేయులు ప్రజాపతి-7095718703,
రహదారి నాగరాజు ప్రజాపతి-9849920700,
దరిపల్లి దుర్గయ్య ప్రజాపతి-9491268087,
దరిపల్లి నగేష్ ప్రజాపతి-99083 34409,రాములు ప్రజాపతి - 98660 08319

# వేములవాడను టెంపుల్ సిటీ, టూరిజం హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం : ఆది శ్రీనివాస్



**చట్టం న్యూస్, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా, టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్‌లో మూడో బ్రిడ్జి స్లాబ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, జిల్లా మంత్రులు మరియు అధికారుల సమన్వయంతో రాజన్న ఆలయంతో పాటు వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.150 కోట్లతో రాజన్న ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వ కాలంలో అభివృద్ధి పనులు శిలాఫలకాలకు మాత్రమే పరిమితమయ్యాయని, ఇచ్చిన హామీలు అమలుకాలేదని విమర్శించారు. 2015లో మూడో బ్రిడ్జికి శంకుస్థాపన చేసినప్పటికీ భూసేకరణ కూడా చేపట్టలేదని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడో బ్రిడ్జి భూసేకరణ కోసం రూ.6.97 కోట్లు మంజూరు చేసి ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు విషయంలో కూడా గతంలో కేవలం శిలాఫలకాలు మాత్రమే ఏర్పాటు చేశారని, ప్రస్తుత ప్రభుత్వం భూసేకరణకు నిధులు విడుదల చేసి పనులు ప్రారంభించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. రాజన్న ఆలయం నుంచి తిప్పాపూర్ బ్రిడ్జి వరకు 80 అడుగుల వెడల్పుతో రహదారి నిర్మాణం జరుగుతోందని, త్వరలోనే ఆధునిక లైటింగ్ సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు. వేములవాడ అభివృద్ధికి సుమారు రూ.1000 కోట్లతో వివిధ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# ఆదిత్య నూతన పుష్ప అలంకరణలో పాల్గొన్న ఆర్టీఐ నాయకులు



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఎల్లారెడ్డిపల్లిలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆదిత్య నూతన పుష్ప అలంకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మొట్లపల్లి గ్రామానికి చెందిన ఈనాడు రిపోర్టర్ తోకల వేణు - వేదశ్రీ దంపతుల ఏకైక పుత్రిక ఆదిత్యను ఆర్టీఐ నేత చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ మొగుళ్లపల్లి మండల కన్వీనర్ బండారు కుమార్ యాదవ్, ఆర్టీఐ నాయకులు డేగ రమేష్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మల సారయ్య, రిపోర్టర్లు రజనీకాంత్, రమేష్ తదితరులు పాల్గొని చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో నిర్వహించిన ఈ వేడుక ఆహ్లాదకర వాతావరణంలో సాగింది. పాల్గొన్న వారు చిన్నారి ఆదిత్యకు ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు.

# అపర భగీరథుడిగా మహమ్మద్ మొయిన్ అహ్మద్ ఖాద్రి



**చట్టం న్యూస్, లింగంపేట్ :** వేసవికాలంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఊరట కల్పిస్తూ మహమ్మద్ మొయిన్ అహ్మద్ ఖాద్రి అపర భగీరథుడిగా నిలిచారని ఇష్రత్ ఉన్నీసా బేగం, మెహ్రూనిషా బేగం పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం లింగంపేట్ మండల కేంద్రంలోని 11వ వార్డులో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండటంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ఖాద్రి కుటుంబ సభ్యులు సొంత నిధులతో బోరు తవ్వించి, మోటారు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు తాగునీరు అందించే అవకాశం అల్లా ప్రసాదించిన వరమని తెలిపారు. కుల, మత, పార్టీ భేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. సమాజానికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. వార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు బోరు, మోటారు ఏర్పాటు చేయడంతో స్థానికులు ఖాద్రి కుటుంబానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ కాసిఫ్, ఉప సర్పంచ్ ప్రసాద్ గౌడ్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నారా గౌడ్, వార్డు సభ్యుడు గుండా బాలకిషన్, రాజు, లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ పీర్ సింగ్, ఖుద్దూస్, కుటుంబ సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# పారిశ్రామికాభివృద్ధితో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి – ఆవుల రాజిరెడ్డి



**చట్టం మెదక్ ప్రతినిధి :** హత్నూర మండలం బోర్పట్ల గ్రామంలో ఏర్పాటు చేసిన తెర నైమ్ బయాలజీక్స్ పరిశ్రమ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ దామోదర రాజ నరసింహ , పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు తో కలిసి నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్రంలో కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. బోర్పట్లలో ప్రారంభమైన ఈ బయోలాజిక్స్ పరిశ్రమ స్థానిక ఆర్థికాభివృద్ధికి తోడ్పడటంతో పాటు పరిసర ప్రాంతాల యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనుందని పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలతో తెలంగాణ దేశంలోనే పారిశ్రామిక రంగానికి ఆదర్శంగా నిలుస్తోందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీఐక్ చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పరిశ్రమ ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదిత్యకు ఆశీస్సులు అందించిన పాత్రికేయులు



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం ఎల్లారెడ్డిపల్లిలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముట్లపల్లి గ్రామానికి చెందిన ఈనాడు రిపోర్టర్ తోకల వేణు - వేదశ్రీ దంపతుల ఏకైక పుత్రుడు ఆదిత్యకు పాత్రికేయులు, సామాజిక నాయకులు ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నిమ్మల సారయ్యతో పాటు పాత్రికేయులు రజనీకాంత్, రమేష్, రాళ్లబండి శ్రీనివాస్, సాగర్, దేవేందర్, శ్రీధర్, తిరుపతి పాల్గొని ఆదిత్యకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆర్టీఐ నాయకులు చర్లపల్లి వెంకటేశ్వర్లు, కుమార్ యాదవ్, డేగ రమేష్ తదితరులు హాజరై ఆశీర్వదించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని ఆదిత్యకు ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు. పుష్పాలంకరణలతో వేదికను ప్రత్యేకంగా తీర్చిదిద్దగా, కార్యక్రమం ఆహ్లాదకర వాతావరణంలో సాగింది.

CHATTAM NEWS

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# గ్రామసభలు, వార్డు సభల ద్వారా ప్రభుత్వ సందేశం ప్రతి ఇంటికి చేరాలి

- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**చట్టం రామగుండం :** జిల్లాలో నిర్వహించనున్న గ్రామసభలు, వార్డు సభల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై సందేశం ప్రతి ఇంటికి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఎన్టీపీసీ కాకతీయ ఫంక్షన్ హాల్‌లో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణశ్రీతో కలిసి ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, వ్యవసాయ, పోలీసు, వైద్య, విద్యుత్, నీటిపారుదల తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలు, మున్సిపల్, పట్టణ ప్రాంతాల్లో వడదెబ్బ కారణంగా ఎవరైనా మరణిస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేస్తుందని తెలిపారు. ఎక్స్‌గ్రేషియా మంజూరుకు ఎఫ్ఐఆర్, పోస్టుమార్టం నివేదిక, మరణ ధృవీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్‌బీఎస్)ను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. కుటుంబంలో మరణం సంభవించిన అర్హులైన కుటుంబాలకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందుతుందని, మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఎంపీడీవో లేదా తహసీల్దార్ స్థాయిలోనే మంజూరు ప్రక్రియ పూర్తవుతుందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 4, 6, 8, 10 తేదీల్లో నిర్వహించే గ్రామసభలు, వార్డు సభలను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం, సూపర్ ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి నిర్వహణ, విద్యుత్ రంగ అవసరాలపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించి ప్రతి ఓటు రక్షణ, కార్యక్రమ షెడ్యూల్, సమర్పించాల్సిన పత్రాలు, దరఖాస్తు విధానం వంటి అంశాలను గ్రామసభల్లో పూర్తిస్థాయిలో వివరించాలని, ప్రజల సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తక్కువ వర్షపాతం పరిస్థితుల్లో అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలపై అవగాహన కల్పించాలని సూచించారు. జూలై 15, జూలై 30, ఆగస్టు 15 నాటికి సాధారణ వర్షాలు నమోదు కాకపోతే ఏ పంటలు సాగు చేయాలనే అంశంపై దశలవారీ కార్యాచరణ ప్రణాళికలను రైతులకు వివరించాలని తెలిపారు. గ్రామసభలు కేవలం ప్రభుత్వ సిబ్బందితో నిర్వహించే కార్యక్రమాలుగా కాకుండా ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాలని పేర్కొన్నారు. సభల నిర్వహణ స్థలం, సమయం, ఉద్దేశ్యాన్ని ముందుగానే ప్రజలకు తెలియజేసి భారీ స్థాయిలో ప్రజలను సమీకరించాలని సూచించారు. తక్కువ వర్షపాతం ఉన్నప్పటికీ ఆకస్మికంగా భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున గ్రామాల్లో బ్యాకప్ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, కాలువల పూడికతీతతో పాటు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం పెంచాలని, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామసభల్లో పాల్గొని వడదెబ్బ నివారణ, వర్షాకాల వ్యాధుల నివారణ, తాగునీటి భద్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అత్యుత్తమ స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూసి మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీటి పారుదల శాఖ అధికారులు జిల్లాలోని చెరువుల కట్టల బలాన్ని పరిశీలించి, మరమ్మతులు అవసరమైన ప్రాంతాల్లో వెంటనే పనులు చేపట్టాలని సూచించారు.సమావేశంలో జడ్పీ సీఈవో నరేందర్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఆర్డీవోలు గంగయ్య, సురేష్, ఏసీపీ గోదావరిఖని రమేష్, జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో శ్రీ సీతారాముల వారిని దర్శించుకున్న : ఎమ్మెల్యే జారే దంపతులు



**చట్టం అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, వారి సతీమణి వరలక్ష్మి, కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ దర్శన కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా సాగింది. ఉదయం భద్రాచలం చేరుకున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దంపతులకు దేవస్థాన అధికారులు, అర్చకులు సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రధాన గర్భగుడిలో శ్రీ సీతారామచంద్ర స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజల సుఖశాంతులు, రైతాంగ సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు, నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా పూజలు చేసినట్లు తెలిపారు. భద్రాచలం క్షేత్రం తెలుగు ప్రజల ఆధ్యాత్మిక జీవనంలో అత్యంత విశిష్ట స్థానం కలిగి ఉందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు. భక్తి, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ఈ పవిత్ర క్షేత్రాన్ని దర్శించుకోవడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు భద్రాద్రి శ్రీరాముడి ఆశీస్సులు పొందేందుకు ఇక్కడికి వస్తారని, ఈ క్షేత్ర మహిమ దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని చెప్పారు. దర్శనానంతరం ఆలయ వేద పండితులు ఎమ్మెల్యే దంపతులకు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో కొద్దిసేపు గడిపిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధిగా అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజల ఆశయాలను నెరవేర్చడం తన ప్రధాన బాధ్యత అని, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తూనే ఉంటానని తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు దేవుని ఆశీస్సులు కోరుకున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, తాగునీరు, రహదారులు, విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని పేర్కొన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ దర్శన కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, అనుచరులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్‌లో చేరిన 40 మంది మోతె గ్రామస్తులు



**చట్టం న్యూస్ లింగంపేట్ :** టిఆర్ఎస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గం ఇంచార్జ్ ఎదురుగట్ల సంపత్ గౌడ్ ఆధ్వర్యంలో లింగంపేట్ మండలంలోని మోతే గ్రామానికి చెందిన 40 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు టిఆర్ఎస్ పార్టీలో చేరారు. టిఆర్ఎస్ పార్టీలో చేరిన వారిలో జి సాయిలు, కె సంగగౌడ్, ఎస్ స్వామి, కే లింగం, జి రమేష్, బి సాయిలు. ఎండి ఖదీర్, ఆర్ సాయిలు, వి వెంకటి రాములు నాయకులు తదితరులు ఉన్నారు. టిఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎదురుగట్ల సంపత్ గౌడ్ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోకల సాయిరాం, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు జైల్ సింగ్, జిల్లా ఎస్ సీ సెల్ అధ్యక్షుడు శ్రీకాంత్, మండల సెక్రటరీ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోని దళిత, గిరిజన జర్నలిస్టుల రక్షణే మా సంకల్పం

- **టీఎస్ఎస్ డబ్ల్యూజేఏ రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న**



**చట్టం పోతంగల్ /కోటగిరి:** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్రంలోని దళిత, గిరిజన జర్నలిస్టుల రక్షణతో పాటు వారి అభివృద్ధి, సంక్షేమమే తమ సంకల్పమని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న వెల్లడించారు. కోటగిరి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి కోటగిరి మండలంలో గల దళిత జర్నలిస్టులతో కలిసి పాత్రికేయుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధులుగా పనిచేస్తూ, సమాజానికి మూల స్థంభమైన జర్నలిస్టులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్రిడిటేషన్ల విషయంలో న్యాయం చేయాలని అన్నారు. చిన్న పత్రికలు, పెద్ద పత్రికలు అనే తేడా చూపకుండా ఆయా పత్రికలలో పని చేసే ప్రతీ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ అందించాలిన్నారు. అదేవిదంగా హెల్త్ కార్డులు, వారి పిల్లల చదువులో పూర్తి శాతం రాయితీ కల్పించాలని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రతీ జర్నలిస్టుకు ఇండ్ల స్థలాన్ని అందించి, ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజన జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రత్యేక రక్షణ చట్టాన్ని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. త్వరలోనే నిజామాబాద్ జిల్లాలో ఉన్న దళిత, గిరిజన జర్నలిస్టులను ఏకం చేసి నిజామాబాద్ జిల్లా ప్రథమ మహాసభను నిర్వహించనున్నట్లు అయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బేగరి రాములు, రాము, భీంరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేరాలను అరికట్టేందుకు పట్టణంలో పోలీసుల నిఘా నేత్రాలు

- **శాంతిభద్రతలను కాపాడేందుకు సీసీ కెమెరాలకు ప్రాధాన్యం**
- **బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్**






**చట్టం రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి పుర పరిధిలోని స్థానిక పోలీస్ స్టేషన్ ను బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నిఘా వ్యవస్థ బలోపేతం కోసం తీసుకుంటున్న చర్యలను ఆయన క్షేత్రస్థాయిలో సమీక్షించారు. స్థానిక పోలీసులు, క్యాతనపల్లి మున్సిపాలిటీ సహకారంతో కొత్తగా పునరుద్ధరించిన 59 సీసీ కెమెరాల పనితీరును ఏసీపీ పరిశీలించారు. పోలీస్ ఉన్నతాధికారులు, రామగుండం సీపీ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. పట్టణ ఎస్సై జాడి శ్రీధర్, మందమర్రి సీఐ పర్శ రమేష్, స్థానిక మున్సిపాలిటీ సంయుక్తంగా పరస్పర సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేసే సీసీ కెమెరాల ఏర్పాటును విజయవంతంగా పూర్తి చేశారని ఏసీపీ వారిని ప్రత్యేకంగా అభినందించారు. గతంలో ఉన్న చిన్నపాటి సాంకేతిక లోపాలు, మరమ్మతులో ఉన్న సీసీ కెమెరాలను గుర్తించి, వాటిని బాగు చేయించి వాటన్నింటినీ నేరుగా పోలీస్ స్టేషన్ కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. పునరుద్ధరించిన 59 సీసీ కెమెరాల అనుసంధానంతో పట్టణ పరిధిలోని దాదాపు అన్ని ప్రధాన కాలనీలు, కూడళ్లు ఇప్పుడు పోలీసుల నిరంతర నిఘా నీడలోకి వచ్చాయని ఏసీపీ తెలిపారు. దీని ద్వారా స్థానికంగా ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలు, దొంగతనాలు వంటి ఆస్తి నష్టానికి సంబంధించిన నేరాలను అరికట్టవచ్చన్నారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా నేరాలను అదుపు చేసేందుకు ఇవి ఎంతో దోహదపడతాయని స్పష్టం చేశారు. పోలీసు సిబ్బంది విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి ఈ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగపడుతుందని, ప్రజలకు మెరుగైన రక్షణ, భద్రతా సేవలను అందించడమే పోలీసుల ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. స్వల్ప వ్యవధిలోనే ఈ ప్రక్రియను పూర్తి చేసినందుకు మందమర్రి సీ.ఐ. రమేష్, ఎస్సై శ్రీధర్, సిబ్బందిని ఏసీపీ కిరణ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు

- **జుక్కల్ క్యాంపు కార్యాలయంలో ప్రజలను కలిసిన ఎమ్మెల్యే**
- **సమస్యలు ఆలకించి అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు**



(**చట్టం ప్రతినిధి కామారెడ్డి**) ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు పేర్కొన్నారు.

**ప్రజలతో ముఖాముఖి**

బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

**అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు**

ప్రజలు వినిపించిన సమస్యలను ఓర్పుగా ఆలకించిన ఎమ్మెల్యే, వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడమే తన బాధ్యతగా భావిస్తున్నానని ఆయన తెలిపారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రవేశాల కోసం ముమ్మర ప్రచారం




**చట్టం అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం ప్రిన్సిపాల్ ఎ. అనిత, అధ్యాపక బృందంతో కలిసి 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను కలిసి విస్తృత ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రత్యేకతలు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి వివరించారు.

**గవర్నమెంట్ కాలేజీలో ఉచిత విద్య**

ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు అందజేయబడుతున్నాయని అధ్యాపకులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందని పేర్కొన్నారు.

**అల్పాహారం – మధ్యాహ్న భోజన పథకాలపై అవగాహన**

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకాల వల్ల విద్యార్థులు పోషకాహారం పొందడంతో పాటు చదువుపై మరింత దృష్టి సారించే అవకాశం కలుగుతుందని వివరించారు. ఈ పథకాల ద్వారా విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

**ప్రభుత్వ కళాశాలలో చేరాలని సూచన**

నాణ్యమైన బోధన, అనుభవజ్ఞులైన అధ్యాపకుల సేవలు, మెరుగైన విద్యా వాతావరణం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల అశ్వారావుపేటలో ప్రవేశాలు పొందాలని విద్యార్థులకు సూచించారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం నారంవారిగూడెం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ నగర్ పేట మాల పల్లి దొంతుకుంట లో అడ్మిషన్ల కోసం అధ్యాపకుల ప్రచారం లో పాల్గొన్నారు బోటనీ అధ్యాపకులు శ్రీ ఎల్ శివ సాయి ప్రసాద్ ఫిజిక్స్ ఎం అశోక బాబు జంతు శాస్త్రం జి సురేష్ మరియు రసాయన శాస్త్రం మా రేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రవేశాల ప్రచారానికి గ్రామస్థుల నుంచి మంచి స్పందన లభించింది.

# కాంగ్రెస్ పార్టీ కార్యకర్త షఫీ మృతికి ఎమ్మెల్యే జారే నివాళి



**చట్టం అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త షఫీ అకాల మరణం పట్ల అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. షఫీ మృతి వార్త తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా షఫీ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. షఫీ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. కుటుంబ పెద్దను కోల్పోయిన బాధను మాటల్లో చెప్పలేమని, ఈ కష్టకాలంలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. షఫీ కాంగ్రెస్ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన కార్యకర్త అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయిలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ అందరి అభిమానాన్ని సంపాదించుకున్న వ్యక్తిగా షఫీ గుర్తుండిపోతారని అన్నారు. కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో ఉన్న నేపథ్యంలో వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. భగవంతుడు షఫీ ఆత్మకు శాంతి ప్రసాదించాలని, కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని భరించే మనోధైర్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని షఫీకి నివాళులర్పించారు.

# రక్తదానం చేసి ప్రాణాన్నీ కాపాడిన రక్తదాత




**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని సిరి మల్టీ స్పెషల్ హాస్పిటల్లో బుధవారం రోజు జక్రాన్ పల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన బోయిడి స్రవంతి అనారోగ్యంతో ఉన్నందున అడ్మిట్ కావడం జరిగింది. డాక్టర్ల సూచన మేరకు పేషెంట్కు A నెగెటివ్ బ్లడ్ అవసరమని సూచించారు. విషయం తెలుసుకుని బోయిడి స్రవంతి, భర్త బోయిడి అశోక్, స్వామి బాయ్ బ్లడ్ ఫౌండేషన్, వ్యవస్థాపకులు మాదరి స్వామి,ని సంప్రదించిన వెంటనే నేనున్నానని భరోసా ఇచ్చి ముందుకు వచ్చి తన అమూల్యమైన రక్త దానం చేసి నిండు ప్రాణాన్ని కాపాడినందుకు పలువురు అభినందించారు. కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# రేపటి నుంచే వార్డు సభలు.. పకడ్బందీగా విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ ఆదేశం



- **వార్డు సభల్లోనే క్షేత్రస్థాయి సమస్యలు, ప్రజా ఫిర్యాదుల తక్షణ పరిష్కారం**
- **"జల్ సంచయ్ – జల్ భాగీధారి" పట్టణ ప్రగతిలో ప్రజలంతా భాగస్వాములు కావాలి**

**చట్టం న్యూస్, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అధ్యక్షతన వార్డు ఆఫీసర్లతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ, స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు పట్టణంలో ప్రజా పాలన ప్రగతి కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించడం జరుగుతోందని స్పష్టం చేశారు. రేపటి నుంచి ప్రారంభం కానున్న వార్డ్ సమావేశాలను అత్యంత ప్రణాళికాబద్ధంగా నిర్వహించి, విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. శాసనసభ్యుల ఆశయాలకు అనుగుణంగా పట్టణాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు ఈ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడానికి 'సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్, 2026' నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఎక్కడికక్కడ చెత్తను శాస్త్రీయంగా సేకరించి తరలించాలని ఆదేశించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా నీటి స్తబ్దత నివారణకు చర్యలు చేపట్టాలని, ఇందుకోసం కాలువల నిర్మూలన మరియు శుభ్రపరిచే పనులను వేగవంతం చేయాలన్నారు. "జల్ సంచయ్ - జల్ భాగీధారి" కింద పట్టణంలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ల నిర్మాణం చేపట్టాలని, కలుషిత నీటి సమస్య రాకుండా తాగునీటి సరఫరా మరియు క్లోరినేషన్ నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పట్టణంలోని రోడ్లు, వీధిలైట్ల నిర్వహణను ఎప్పటికప్పుడు చూసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ కార్యకలాపాలలో భాగంగా ప్రతి వార్డులో ప్లాంటేషన్ పనులను ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు.వార్డు సభలకు వచ్చే ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను స్వయంగా పరిశీలించి వార్డు సభల ద్వారానే వాటిని తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నేతృత్వంలో సాగుతున్న ఈ పట్టణ ప్రగతి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, వార్డుల వారీగా జరిగే ఈ సభలకు ప్రజలందరూ పెద్ద ఎత్తున హాజరై పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలని చైర్మన్ పుల్కం రాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్, మేనేజర్ సంపత్ రెడ్డి, వార్డ్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

# సభ్యత్వ నమోదే లక్ష్యం.. బీఆర్ఎస్ శ్రేణులు సమాయత్తం

- **అభివృద్ధి కుంటుపడిందని ప్రభుత్వంపై గణేష్ బిగాల విమర్శలు**





**నిజామాబాద్, చట్టం న్యూస్:** రానున్న రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించాలని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నగరంలో నిర్వహించిన బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలే బీఆర్ఎస్‌కు వెన్నెముక అని పేర్కొన్నారు. ప్రతి బూత్‌లో పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని సూచించారు. ఎన్నికల కమిషన్ చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా పార్టీ నాయకులు, బూత్ ఇంచార్జులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఓటరు హక్కును పరిరక్షించడం ప్రజాస్వామ్య బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధుల పనితీరుపై గణేష్ బిగాల తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాలేదని, నిజామాబాద్ నగర అభివృద్ధి పూర్తిగా గాడితప్పిందని ఆరోపించారు. రోడ్లు, పారిశుధ్యం, తాగునీరు, మౌలిక వసతుల విషయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పక్కనబెట్టి పాలకులు ప్రచార కార్యక్రమాలకే పరిమితమయ్యారని విమర్శించారు. నగర అభివృద్ధిపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికార పార్టీ నాయకులపై ఉందన్నారు. సమావేశంలో పాల్గొన్న పలువురు నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి చేసిన కృషిని ప్రజలు మరచిపోలేరని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రజల మధ్యకు వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని తీర్మానించారు. సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు, డివిజన్ ఇంచార్జులు, బూత్ ఇంచార్జులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ చట్టాలు

**చట్టం ;** ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది నైపుణ్యానికి సంబంధించిన ఆట అయినప్పటికీ దానికి రాజ్యాంగ రక్షణ ఉండబోదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. వివిధ క్రీడలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక చేసిన చట్టాల రాజ్యాంగబద్ధతను సమర్థించింది. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ అంశాలపై చట్టాలు రూపొందించేందుకు రాష్ట్రాలకు పూర్తి అధికారం ఉందని జస్టిస్ పార్థివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది.

CHATTAM NEWS
చట్టం సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక

# మానవత్వంతో స్పందించి...వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందించి



**చట్టం న్యూస్ రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక రెండో వార్డ్ జ్యోతి నగర్ ఏరియాకు చెందిన పాండురాజు రాయమల్లు గత కొద్దిరోజులుగా గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. చిన్న పాటి కూలి పని చేసుకొనే అతనికి కనీసం ఆపరేషన్ కొరకు వైద్య ఖర్చులకు కూడా లేక ఆ నిరుపేద కుటుంబం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని స్థానికుల సహకారంతో ఆత్మీయ చారిటబుల్ ట్రస్ట్ కు తెలపడంతో వెంటనే స్పందించిన ట్రస్టు సభ్యులు నేరుగా వారి కుటుంబాన్ని కలిసి అతనికి మనోధైర్యం కల్పించి పదివేల రూపాయల చెక్కును ఆ కుటుంబ సభ్యులకు అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా రాయమల్లు కుటుంబ సభ్యులు ఆత్మీయ ట్రస్టు సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇంకెవరైనా సహాయం అందించే దాతలు ఉంటే తమను సంప్రదించాలని కోరారు. విరాళంగా ఇచ్చిన డబ్బులను ఆ కుటుంబానికి అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు సుంకరి మల్లేష్, సభ్యులు సట్ల మహేందర్, రజక సంఘం నాయకులు నడిగొట తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# మణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని శ్రీ నవనాథ సిద్ధుల గుట్ట అయ్యప్ప దేవాలయంలో బుధవారం రోజును పురస్కరించుకొని నగేష్ శర్మ గురుస్వామి, ఆధ్వర్యంలో శ్రీ గణపతి, శ్రీసుబ్రహ్మణ్యం, శ్రీఅయ్యప్ప స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్పం, మధ్యాహ్నం 12.30 నిముషాలకు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మణికంఠ సేవా సమితి అధ్యక్షులు చేపూరు దనంజయ్, మాట్లాడుతూ ఈ కార్యక్రమంనకు వి.అయ్యప్ప శ్రీనివాస్, అయ్యప్ప ఆలయం నిర్మాణ కర్త సహాయ సహకారం అందిస్తున్నందుకు, నవనాథ సిద్ధుల గుట్ట ఆలయ కమిటీ, దాతలకు, పాల్గొన్న అయ్యప్ప స్వామి భక్తులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఆ మణికంఠుడి యొక్క ఆశీస్సులు మీకు మీ కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో మణికంఠ సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఉదయ్, ఉపాధ్యక్షులు కౌటికే విజయ్, కోశాధికారి సురేష్ చారి, ప్రచార కార్యదర్శి గంగా మోహన్, కార్యవర్గ సభ్యులు ఒడ్డేన్న, సలహదారులు శ్రీహరి, నవనాథ సిద్ధుల గుట్ట కమిటీ సభ్యులు దత్తు గురు స్వామి, కొండవీటి శ్యామ్ గురు స్వామి, మోహన్ రావు గురు స్వామి, గ్యాస్ ప్రభాకర్ గురు స్వామి, నవీన్ రెడ్డి గురు స్వామి, నర్సారెడ్డి గురు స్వామి, గోవింద్ పేట్, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బైరాపూర్‌లో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- **నలుగురు అరెస్ట్ - నగదు, బైక్‌లు, మొబైల్స్ స్వాధీనం**
- **పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవు - ఎస్సై రాములు హెచ్చరిక**

**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు.

**పక్కా సమాచారంతో రెక్కీ - నిందితులు అరెస్ట్**

పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు రెక్కీ నిర్వహించిన ఎస్సై రాములు బృందం పేకాట ఆడుతున్న కేతావత్ సంగ్రామ్, కేతావత్ ప్రకాష్, ఫతులోత్ సంతోష్, ఎరుకలి సురేష్‌లను అదుపులోకి తీసుకుంది.

**రూ.2010 నగదు, 4 బైకులు స్వాధీనం**

నిందితుల నుంచి రూ.2010 నగదు, 3 మొబైల్ ఫోన్లు, నాలుగు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాములు తెలిపారు.

**పేకాట నిర్వహిస్తే కేసులు తప్పవు - ఎస్సై హెచ్చరిక**

పేకాటలు ఎవరైనా ఆడినా, ఎవరైనా నిర్వహించినా సమాచారం అందితే ఎవరినీ వదిలిపెట్టేది లేదని, వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాములు హెచ్చరించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

# గ్రామ,వార్డుల సభలను సమర్థవంతంగా నిర్వహించాలి

- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**చట్టం మెదక్ ప్రతినిధి :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలో గ్రామ, వార్డు సభలు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ కార్యాలయం నుండి రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ .. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10 తేదీలలో అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలోని వార్డులలో నిర్వహించనున్న సభలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. సభలలో కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి కుటుంబం మొక్కలు నాటేలా అవగాహన కల్పించాలని సూచించారు. రహదారుల చుట్టు పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించి అవెన్యూ ప్లాంటేషన్ లో మొక్కలు నాటాలని తెలిపారు. మురుగుకాల్వలు పరిశుభ్రం చేయుట, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఇండ్ల నుండి వచ్చే మురుగునీరు రోడ్లపైకి వెళ్లకుండా కమ్యూనిటి, వ్యక్తిగత ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులు అందించేందుకు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. గ్రామసభలలో మహిళల రక్షణ, బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల నివారణ, రహదారి భద్రతపై అరైవ్ అలైవ్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రానున్న వర్షాకాలంలో గ్రామాలలో పారిశుధ్యం, మురుగు కాలువల శుభ్రత, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, భారీ అకాల వర్షాల వల్ల వాగులు వంకలు పొంగితే తీసుకోవాల్సిన రక్షణ చర్యలు ప్రజలను తరలించేందుకు అవగహన కల్పించాలని తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలను సిద్ధం చేసుకోవాలని, రాష్ట్ర, కేంద్ర ప్రకృతి విపత్తుల ప్రతిస్పందన బృందాలను, రెస్క్యూ బృందాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఇట్టి కార్యక్రమాలకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. ఎన్ లినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు వ్యవసాయ అధికారులను ఆదేశించారు. పంటల అవశేషాలు కాల్చొద్దని దాని వల్ల భూమిలో ఉన్న పోషకాలు చనిపోతాయని కలియదున్నడం వల్ల భూమికి బలం పెరుగుతుందని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ..పోలీస్ అధికారులు మండల, డివిజన్ స్థాయి అధికారులను సమన్వయం చేసుకుంటూ పటిష్ట రక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ, వార్డు సభలలో పోలీస్ అధికారులు పాల్గొనాలని ప్రకృతి వైపరీత్యాలు, వర్షాలు, పిడుగుల వల్ల తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. 10వ తేదీన జరుగనున్న ప్రతి గ్రామసభలో అరైవ్ ఎలైవ్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. రహదారి సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. 12వ తేదీన డ్రగ్స్ మహమ్మారిపై జరుగనున్న సభలలో ప్రజలకు అవగహన కల్పించాలని సూచించారు. నకిలీ విత్తనాలు ఎరువులు విక్రయిస్తే పిడి యాక్టు నమోదు చేయాలని ఆదేశించారు. సీజన్ కు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా, విద్యుత్, విద్య, ప్రణాళిక, తదితర శాఖల అధికారులతో పాటు అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడివోలు, ఎంఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

# బాసర ట్రిపుల్ ఐటీ లో సీట్ సాధించిన విద్యార్థిని సన్మానించిన ఎమ్మెల్యే



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో బుధవారం రోజు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, నివాసంలో తన స్వంత గ్రామమైన అంకాపూర్ కు చెందిన అంబటి వైష్ణవి, సంతోష్, దంపతుల కుమారుడు రామ్ చరణ్, బాసర త్రిబుల్ ఐటీ లో సీట్ సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పిల్లలు తల్లిదండ్రులు గర్వపడేలా ఉండాలని చదువుతోపాటు మానసికంగా, శరీరకంగా మంచి లక్షణాలు అలవర్చుకోవాలని రామ్ చరణ్, కు భవిష్యత్తులో ఏ అవసరం వచ్చిన తాను ముందుండి సాయం చేస్తానని మరింత ఉన్నతంగా ఎదగాలని కోరుకుంటున్నాను అని ఎమ్మెల్యే అన్నారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం





- **మహిళలను గౌరవించుకునే పార్టీ కాంగ్రెస్ పార్టీ,ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి నా ధ్యేయం**
- **పరకాల మహిళా డైరీలో ప్రతి మహిళా భాగస్వామ్యం కావాలి**
- **మహిళా సమైక్య భవనం లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**

**చట్టం/ పరకాల ;** సంగెం మండలం మొండ్రాయి గ్రామం కేకే ఫంక్షన్ హాల్ యందు మొండ్రాయి,గొల్లపల్లి, బాలు నాయక్ తండ, ముమ్మిడివరం, వంజరపల్లి మరియు తిమ్మాపురం గ్రామ ప్రభుత్వ పాఠశాల యందు తిమ్మాపురం, గాంధీనగర్, నర్సానగర్, కొత్తగూడెం గ్రామాలలో నిర్మించనున్న మహిళా సమైక్య భవనం లకు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేశారు.అనంతరం ఎమ్మెల్యే ని శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విరివిరిగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ...మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని,కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు.గ్రామాల్లో నిర్మిస్తున్న మహిళా సమైక్య భవనాలు మహిళల అభివృద్ధికి, సాధికారతకు కేంద్రాలుగా నిలుస్తాయి. స్వయం సహాయక సంఘాల సమావేశాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, ఉపాధి కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనాలు ఎంతగానో ఉపయోగపడతాయి అన్నారు.దేశానికి వెన్నెముక మహిళా సోదరీమణులే అని, మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది అన్నారు. ప్రతి మహిళ స్వయం సమృద్ధిగా ఎదిగి కుటుంబానికి, సమాజానికి, రాష్ట్రానికి దేశానికి ఆదర్శంగా నిలవాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు.కుట్టు శిక్షణ ద్వారా మహిళలకు కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం అన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే సమాజం మరింత శక్తివంతంగా తయారవుతుందని అన్నారు.మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పరిమితిని రూ 5 లక్షల నుండి 10 వరకు పెంచి, బ్యాంకు రుణాల వడ్డీని ప్రభుత్వమే భరిస్తుంది అన్నారు. మహిళలకు ఉచితబస్ ప్రయాణం, పెట్రోల్ బంకులు,సోలార్ విద్యుత్ ఉత్పత్తి, రైస్ మిల్లులు, మహిళా శక్తి సూపర్ బజార్లు, వి హబ్ సెంటర్ ,మహిళా ఉత్పత్తుల మార్కెటింగ్కు అనుగుణంగా ఆధునిక వసతులతో గ్రామ మహిళా భవనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.పరకాల మహిళా డైరీ ఏర్పాటు మహిళలపై పూర్తి నమ్మకంతో ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి మహిళా భాగస్వామ్యం కావాలని కోరారు.రేవంత్ అన్న నాయకత్వంలో మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500రూ వంటగ్యాస్,సన్న బియ్యం, హాస్టల్ విద్యార్థులకు డైట్ చార్జెస్ పెంపు,ఆరోగ్య శ్రీ 10 లక్షలకు పెంపు, ఇందిరమ్మ ఇండ్లు, ఏకకాల రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర సంక్షేమ పథకాలను అందిస్తున్నామని అన్నారు.

# లింగంపల్లి, అడివిలింగాల బ్రిడ్జిల నిర్మాణానికి రూ.8.50 కోట్ల నిధులు



**సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం**

**చట్టం లింగంపేట్ :** గత వర్షాకాలంలో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న లింగంపల్లి, అడివిలింగాల బ్రిడ్జిల పునర్నిర్మాణానికి రూ.8.50 కోట్ల నిధులు మంజూరు కావడంతో లింగంపల్లి బ్రిడ్జి వద్ద కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిరాం యాదవ్ గోకుల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, గతంలో భారీ వర్షాల వల్ల బ్రిడ్జి తెగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అధికారులతో చర్చించి నిధుల మంజూరుకు కృషి చేయడంతో నిర్మాణ పనులకు మార్గం సుగమమైందన్నారు. లింగంపల్లి ఖుర్ద్-అడివి లింగాల హై లెవల్ బ్రిడ్జి పునర్నిర్మాణం నియోజకవర్గ ప్రజల చిరకాల కోరికగా ఉండేదని, నిధుల మంజూరుతో ఆ కల సాకారం కానుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాజకీయ విమర్శలపై స్పందిస్తూ, అసత్య ప్రచారాలకు పాల్పడకుండా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ప్రత్యర్థి పార్టీల నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నారాగౌడ్, సక్రు నాయక్, దశరథ నాయక్, ఎల్లమయ్య, కౌడ రవి, ప్రసాద్ గౌడ్, కాశీరాం, సర్వన్ నాయక్, బాలకిషన్, శ్రీనివాస్, సేవియా నాయక్, నర్సింలు, రమేష్, బాబు నాయక్, లింగం, మక్కల బాబు, రఫీకొద్దీన్, విట్టల్, మహేష్‌గౌడ్, నాగరాజు, అబ్దుల్, హర్షద్, ఫుల్ సింగ్, సునీల్, శంకర్, నబి, పోచయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం చేపట్టి లబ్ధిదారుల కలలో తేజస్వి నింపిన బోధన్ ఎమ్మెల్యే



**చట్టం రెంజల్ :** రెంజల్ మండలం పరిధిలో దండిగుట్ట, వీరన్న గుట్ట, రెంజల్, బోర్గాం, గ్రామాలలో ప్రభుత్వ ముఖ్య సలహాదారులు, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి పర్యటనలో భాగంగా నూతనంగా నిర్మించుకున్న గృహప్రవేశాలను ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టి లబ్ధిదారుల కలలో తేజస్వి నింపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ముఖ్య సలహాదారులు, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రెంజల్ మండలానికి దాదాపు వెయ్యి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశామని గుర్తు చేశారు. ఇందులో భాగంగా గ్రామాల వారిగా నూతన గృహాలను ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. నూతన గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమం విచ్చేసిన ప్రభుత్వం ముఖ్య సలహాదారులు, మాజీ మంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ని లబ్ధిదారులు శాలువులతో ఘన సన్మాన కార్యక్రమం చేపట్టి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిర్మాణం చేపట్టే ఇందిరమ్మ ఇల్లు త్వరతగతన పనులతో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉండే విధముగా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తుంది నేపథ్యంలో చివరి ఆయకట్టు తో నీటి సమస్యలు తలెత్తకుండా రైతులు వంద రోజులు లోపు పంటలు పండించుకునే విధముగా వ్యవసాయ అధికారులు రైతులకు సలహా సూచనలు చేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తహర్బిన్ హందాన్, మాజీ ఎంపీపీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మోబిన్ ఖాన్, స్థానిక గ్రామ సర్పంచ్ తిరుపతి లలిత, ఉప సర్పంచ్ చీలం మానస రాకేష్ రెడ్డి, బోధ నియోజక వర్గ కాంగ్రెస్ అధ్యక్షులు కార్తీక్ యాదవ్,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గైనిక్ కిరణ్, తాహసిల్దార్ శ్రావణ్ కుమార్, ఎంపీడీవో వారణాసి కమలాకర్, సి డి సి మాజీ డైరెక్టర్ సాయిబాబా గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాములు, మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఇందిరా రెడ్డి, వీరన్న గుట్ట గ్రామ సర్పంచ్ ఏత్తరి మాధవి సాయిలు, మాజీ ఎంపిటిసి బోగిడి కవిత, వీరన్న గుట్ట మాజీ సర్పంచ్ వినోద్, ఆసాని అనిల్, చందూర్ సంతోష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సగ్గు వెంకటి, గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు గైని సాయిలు, బోగిడి రవి, చందూర్ సాయన్న, చిలుక అశోక్, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

# సాంస్కృతిక సంప్రదాయ నృత్యాన్ని కాపాడుతూ పిల్లలకు నేర్పిస్తున్న నిరోషా



**చట్టం/పరకాల ;** హనుమకొండలోని వీర బ్రహ్మేంద్ర స్వామి హాల్లో భక్తి ఛానల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది చిన్నారులు భక్తి గీతాలకు అద్భుతమైన నృత్య ప్రదర్శనలు ఇస్తూ, సంప్రదాయ కళా వైభవాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. ఈ సందర్భంగా పిల్లలు మాట్లాడుతూ, “మా గురువు నిరోషా మాకు దైవంతో సమానం. ఆమె ఎంతో శ్రద్ధగా, ప్రేమతో కూచిపూడి నృత్యాన్ని నేర్పిస్తున్నారు. మా తల్లిదండ్రులకు మేము ఈ కళను నేర్చుకోవాలని ఎంతో కోరిక ఉండేది. ఆ కోరికను మా గురువు నిరోషా నెరవేర్చారు” అని ఆనందం వ్యక్తం చేశారు. గురువు నిరోషా మాట్లాడుతూ, “నాకు చిన్నప్పటి నుంచే ఇంట్లో సంగీతం, నాట్యానికి సంబంధించిన వాతావరణం ఉండేది. మా అమ్మ నా తొలి గురువు. నాలోని లయ, కళాప్రతిభను గుర్తించి నన్ను ఎంతో ప్రోత్సహించారు. నేను మొదటిసారి గజ్జె కట్టిన రోజు ఇప్పటికీ నా జీవితంలో మధురమైన జ్ఞాపకంగా నిలిచిపోయింది” అన్నారు. అంతేకాకుండా, “నా వద్ద శిక్షణ పొందుతున్న విద్యార్థులను కూడా భవిష్యత్తులో మంచి కళాకారులుగా, గొప్ప గురువులుగా తీర్చిదిద్దాలనేది నా లక్ష్యం. వారు కూడా ఉన్నత స్థాయికి చేరుకుని కూచిపూడి కళా సంప్రదాయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను” అని నిరోషా తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కూచిపూడి వంటి భారతీయ సాంప్రదాయ నృత్య కళల పరిరక్షణలో గురువు నిరోషా చేస్తున్న కృషిని పలువురు అభినందించారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహణపై అవగాహన కార్యక్రమం



**చట్టం /పరకాల;** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)2026 కార్యక్రమంపై 104పరకాల శాసనసభ నియోజకవర్గ స్థాయి సమావేశం పరకాల పట్టణంలోని మహదేవ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. పరకాల ఆర్డీవో డిఎస్ వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్2026 కార్యక్రమ నిర్వహణ, ఓటరు జాబితాల సవరణ, కొత్త ఓటర్ల నమోదు, వివరాల మార్పులు, తొలగింపులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు ఓటరు జాబితాల పరిశీలనను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో బీఎల్ఏలు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని తెలిపారు. 104పరకాల శాసనసభ నియోజకవర్గ పరిధిలోని అన్ని బూత్‌లకు చెందిన బీఎల్ఏలు ఈ సమావేశానికి హాజరయ్యారు.ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్వోలు), తహసీల్దార్లు పరకాల టి విజయలక్ష్మి, దామెర జ్యోతి వరలక్ష్మి, ఆత్మకూరు జగన్మోహన్ రెడ్డి, నడికుడ రాణి, గీసుకొండ రియాజుద్దీన్, సంగెం రాజ్ కుమార్, బీఎల్ఓ సూపర్వైజర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన విజయ చందర్ రెడ్డి



**చట్టం / పరకాల ;** దామెర మండలం ల్యాదెళ్ల గ్రామానికి చెందిన సిందే శ్రీనివాస్ - తిరుపతి తండ్రి సిందే బాపు రావు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన సందర్భంగా వారి దశదిన కర్మ కార్యక్రమంలో బీజేపీ భద్రాది కొత్తగూడెం జిల్లా ఇంచార్జీ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి పాల్గొని, వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేల్పుల రాజ్‌కుమార్ , ములక ప్రసాద్ , డెంగు నవీన్ , బూత్ అధ్యక్షులు అన్నబోయిన రోహిత్ , బత్తుల సుమంత్ , ననబోయిన శ్రీనివాస్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ను కలిసి సన్మానించిన అంకాపూర్ గ్రామ పాలక వర్గం



**చట్టం ఆర్మూర్:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామ సర్పంచ్ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, నివాసంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేడ్ స్కూల్ అంకాపూర్ గ్రామ శివారులో 200 కోట్ల రూపాయలతో మంజూరు చేసిన ఎమ్మెల్యేకు శాలువతో సన్మానించారు. అంకాపూర్ గ్రామానికి అభివృద్ధి విషయంలో గ్రామ పాలకవర్గం పార్టీలకు అతీతంగా తొడ్పాటు అందిస్తాం అని గ్రామ సర్పంచ్ దేవేందర్ రెడ్డీ తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జన్మనిచ్చిన ఊరుకు ఏమిచ్చిన రుణం తీర్చుకోలేనిదని విస్తృతంగా అభివృద్ధి చేస్తూ అంకాపూర్ గ్రామాన్ని అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉండేలా గ్రామ పాలకవర్గానికి పూర్తి స్థాయి మద్దతు ఇస్తాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ తుకారాం, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులతోనే విద్యార్థుల బంగారు భవిష్యత్ సాధ్యం




**చట్టం వెల్దుర్తి:** వెల్దుర్తి మండల పరిధిలోని షేరిల గ్రామం నుండి బడిబాట కార్యక్రమం ప్రారంభించారు ఇందులో భాగంగా గ్రామంలోని ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్దుర్తి ప్రధానోపాధ్యాయులు సాంబయ్య విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ మా పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, నాణ్యమైన బోధన, విశాలమైన తరగతి గదులు, ప్రయోగశాల, గ్రంథాలయం, క్రీడా సౌకర్యం, విద్యార్థుల ప్రతిభను వెలికి తీసే వివిధ రకాల కార్యక్రమాలు అందుబాటులో ఉన్నాయి. విద్యతోపాటు నాయకత్వ లక్షణాలు అందిస్తున్నాము అని తెలిపారు. అనంతరం విద్యాధికారి బుచ్చేష్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు ప్రభుత్వం అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం, ఇతర సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలు శ్రమిస్తున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లావణ్య -రవి ఉప సర్పంచ్ నవీన్ కుమార్, ఉపాధ్యాయ బృందం గ్రామస్తులు పాల్గొన్నారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర వార్తా పత్రిక
CHATTAM NEWS
నిజామాబాద్
గురువారం
04.06.2026


# తెలంగాణ రైతులపై కేంద్రం వివక్ష చూపుతోంది : మంత్రి పొన్నం ప్రభాకర్



**చట్టం సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ రైతులు దేశంలోనే అత్యధికంగా ధాన్యం ఉత్పత్తి చేస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం రాష్ట్ర రైతుల పట్ల వివక్ష చూపుతూ ధాన్యం సేకరణ లక్ష్యాలను కుదించడం దురదృష్టకరమని రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలనే సంకల్పంతో ప్రజా పాలన ప్రభుత్వం పనిచేస్తుంటే, కేంద్రం మాత్రం రైతులను నిరాశపరుస్తోందనీ తెలిపారు. 202526 రబీ (యాసంగి) సీజన్‌లో ఇప్పటివరకు 67.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, రూ.12,375 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని. 10 లక్షల మందికి పైగా రైతులు లబ్ధి పొందారన్నారు.. అకాల వర్షాల వల్ల తడిసిన 10,215 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా రైతులు నష్టపోకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించిందనీ గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో 8575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు కేంద్రాలకు తీసుకొచ్చే చివరి గింజ వరకు కొనుగోలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందనీ కానీ కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లేదని పేర్కొన్నారు. యాసంగిలో తెలంగాణలో 141 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తే , కేంద్రం కేవలం 52 లక్షల టన్నులు.. అంటే 37 శాతానికి పరిమితం చేసిందని తెలిపారు. మరోవైపు పంజాబ్‌కు 86 శాతం, ఛత్తీస్‌గఢ్‌కు 67 శాతం, హర్యానాకు 65 శాతం, ఒడిశాకు 52 శాతం సేకరణ లక్ష్యాలు కేటాయించిన కేంద్రం, తెలంగాణకు మాత్రం కేవలం 37 శాతం మాత్రమే కేటాయించడం రాష్ట్రం పట్ల బీజేపీ చేస్తున్న వివక్షను ఎండగట్టారు. గత ప్రభుత్వం పదేళ్లలో ధాన్యం కొనుగోళ్లకు రూ.1.35 లక్షల కోట్లు ఖర్చు చేయగా, ప్రజా ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే రూ.84 వేల కోట్లను రైతుల కోసం ఖర్చు చేసి సగటున ఏడాదికి రూ.42 వేల కోట్లను రైతుల కోసం వెచ్చించడం కాంగ్రెస్ ప్రభుత్వ రైతు సంక్షేమ నిబద్ధతకు నిదర్శనం అన్నారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించి చేతులు దులుపుకుంటోందని కొనుగోళ్ల బాధ్యత మొత్తం రాష్ట్రాలపై భారం మోపుతోందన్నారు.మొక్కజొన్నకు క్వింటాల్‌కు రూ.2,400 చెల్లిస్తూ ఇప్పటికే రూ.1172 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని , జొన్నలను క్వింటాల్‌కు రూ.3699 చొప్పున కొనుగోలు చేసి రూ.350 కోట్లను రైతులకు చెల్లిస్తే ఇందులో కేంద్రం ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం దురదృష్టకరం అన్నారు. తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం ధాన్యం సీలింగ్‌ను వెంటనే ఎత్తివేయాలని రాష్ట్రంలో పండిన ధాన్యంలో కనీసం 70 శాతం కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. తుమ్మిడి హెట్టి ప్రాజెక్టుపై కేంద్రం, రాష్ట్ర బీజేపీ నేతల నిర్లక్ష్యం ఉత్తర తెలంగాణ రైతుల భవిష్యత్తుకు అత్యంత కీలకమైన తుమ్మిడి హెట్టి బ్యారేజీ అంశంపై ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తోందని.,మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చల కోసం రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు లేఖలు రాసినా స్పందన లేదన్నారు. ఇటీవల మే 6 వ తేదీన నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ,మే 25 వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కు లేఖలు రాసినా ఇప్పటివరకు స్పందించలేదనీ తెలిపారు. తెలంగాణ ప్రయోజనాల కోసం రాష్ట్ర బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదనీ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. మహారాష్ట్రలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా, తెలంగాణ బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎందుకు ఒత్తిడి తేవడం లేదన్నారు. తెలంగాణ రైతులకు రావాల్సిన నీటి హక్కుల విషయంలో బీజేపీ మౌనం వీడాలని సూచించారు. ఉత్తర తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడి హెట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని, రాష్ట్ర బీజేపీ నాయకులను డిమాండ్ చేశారు.

## ప్రజా పాలన 99 రోజుల కార్యాచరణపై అధికారులకు కమిషనర్ కీలక ఆదేశాలు



**చట్టం – సిద్దిపేట ప్రతినిధి :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక చివరి పది రోజుల కార్యక్రమాలపై మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ వార్డు అధికారులు, బీఎల్ఓల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. జూన్ 4 నుంచి 12 వరకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై పలు సూచనలు జారీ చేశారు. జూన్ 4, 6, 8, 10 తేదీలలో 43 వార్డులను నాలుగు విడతలుగా విభజించి ఉదయం 9 గంటలకు వార్డు సభలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సభలకు పంచాయతీ రాజ్, వ్యవసాయ, అగ్నిమాపక, ఇరిగేషన్ శాఖల అధికారులు హాజరై ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వార్డు సభల నిర్వహణకు టెంట్లు, కుర్చీలు, తాగునీరు, ఫ్లెక్సీలు తదితర ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా పట్టణంలోని బ్లాక్ స్పాట్లను గుర్తించి నిర్మూలించాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్న వారిపై జరిమానాలు విధించాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో పోలీస్ శాఖ సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా యజమానులకు నోటీసులు జారీ చేయాలని, పరిసర ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మురికి కాలువల్లో సిల్ట్ తొలగింపు పనులు తప్పనిసరిగా పూర్తి చేయాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నివారణకు ప్రతి వార్డులో ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. రోడ్లపై గుంతలు, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. వార్డు సభల్లో ప్రజలకు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్-2026 నిబంధనలపై అవగాహన కల్పించాలని తెలిపారు. తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, పారిశుధ్య వ్యర్థాలు, ప్రత్యేక శ్రద్ధ అవసరమైన వ్యర్థాలను వేర్వేరుగా సేకరించే విధానాన్ని వివరించాలని సూచించారు. అలాగే జల్ సంచయ్ జన భాగీదారీ కార్యక్రమం, మురికి కాలువల శుభ్రపరిచే పనులు, వర్షాకాల సన్నద్ధత, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రోడ్ల నిర్వహణ, వీధి దీపాలు, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ చర్యలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఎలక్టోరల్ మ్యాపింగ్ పురోగతిపై కూడా సమీక్ష నిర్వహించి, ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రేరణ, పృథ్వీ, జమీల్, శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీకాంత్, వార్డు అధికారులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## వైట్ పాయిజన్స్‌తో ఆరోగ్యానికి పొంచి ఉన్న ముప్పు



తీపిఉప్పుతెల్లబియ్యం.. డయాబెటిస్, బీపీకి మూలం అని డాక్టర్స్ పోషకాహార నిపుణులు అంటున్నారు వీటికి బదులు ఆరోగ్యకర ప్రత్యామ్నాయాలు చూసుకోవాలని సలహా ఇస్తున్నారు పూర్వీకులు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా జీవించేవారు. నేడు 25 ఏళ్లు దాటక ముందే రోగాలతో ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. కారణం మన ఆహారంలో ఎక్కువగా వాడే మూడు పదార్థాలు. చక్కెర, ఉప్పు, తెల్లబియ్యంతో చాలా అనర్థాలని వైద్యులు చెబుతున్నారు. వీటిని వైట్ పాయిజన్స్‌గా పేర్కొంటున్నారు. ఉన్న రోగాలు తగ్గాలన్నా, కొత్తగా రాకుండా ఉండాలన్నా, వీటి వినియోగం తగ్గించాలంటున్నారు. అయితే నాలుకకు అలవాటైన రుచిని ఒక్కసారిగా వదిలేయడం కష్టమే. అందుకే ఆరోగ్యాన్ని కాపాడే ప్రత్యామ్నాయ మార్గాలు అవసరంగా మారాయి.

**చక్కెర.. తీయని విషం**

మన రోజువారీ జీవితంలో చక్కెర భాగమైపోయింది. టీ, కాఫీ నుంచి స్వీట్స్ వరకూ చక్కెర లేనిదే కుదరదు. కాని ఇందులో ఎటువంటి పోషకాలు లేవు. అధికంగా తీసుకుంటే రక్తంలో ఇన్సులిన్ స్థాయిలు అస్తవ్యస్తమౌతాయి. ఆ తర్వాత డయాబెటిస్ మాత్రమే కాకుండా కాలేయం చుట్టూ కొవ్వు పేరుకుపోయ గే ఫ్యాటీ లివర్, రక్త నాళాల్లో మంట, గుండెజబ్బులు వంటి సమస్యలు తలెత్తుతాయిప్రత్యామ్నాయాలు ఇవే..

స్టీవియా (మధుపత్రి) మొక్కల నుంచి తీసిన సహజ స్వీటనరీ చక్కెరకు గట్టి ప్రత్యామ్నాయంగా తెరపైకి వచ్చింది. ఇందులో క్యాలరీలు సున్నా. రక్తంలో చక్కెర స్థాయిలు పెంచదు. ' షుగర్ ఫ్రీ గ్రీన్' వంటి ఉత్పత్తులు సురక్షిత మార్గంగా పరిగణిస్తున్నారు. పెద్ద, పెద్ద కిరాణా దుకాణాల్లో లభిస్తాయి. టీ లేదా కాఫీలో చిటికెడు వేస్తే సహజ తీపి సువాసన ఇస్తుంది. రక్తంలో చక్కెర నియంత్రణకు తోడ్పడుతుంది.

**"ఉప్పుతో ముప్పులెన్నో.."**

మన వంటల్లో ఉప్పు తప్పనిసరి.. సాధారణంగా ఉప్పులో సోడియం అధికంగా ఉండడం వల్ల శరీరంలో నీటి శాతం పెరిగి రక్తనాళాలపై ఒత్తిడి పెరుగుతుంది. బీపీ 150160 దాటితే అత్యంత ప్రమాదకరం. దీనివల్ల పక్షవాతం, కిడ్నీలు దెబ్బతినడం, గుండెపోటు వంటి సమస్యలకు ఇది ప్రధాన కారణం.

లోసోడియం సాల్ట్ (ఓ సాల్ట్): సోడియం తక్కువగా, పొటాషియం ఎక్కువగా దీంట్లో ఉండడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అయితే కిడ్నీ సమస్యలు వున్నవారు లేదా కొన్ని బీపీ మందులు వాడే వారు లోసోడియం సాల్ట్ వాడే ముందు వైద్యుని సలహా తీసుకోవాలి. అలాగే వేయించిన వెల్లుల్లి పొడిని ఉప్పుకి బదులుగా వాడుకోవచ్చు. కూర చివరలో నిమ్మరసం కలిపితే రుచికి లోటుండదు.జీలకర్ర, ధనియాల పొడి, వేయించిన జీలకర్ర పొడి ఉప్పుకు సమానమైన రుచిని ఇస్తుంది. ఉప్పు తక్కువగా వున్నా భోజనం రుచిగా ఉంటుంది. పాలిస్ పెరిగే కొద్దీ తెల్లబియ్యంలో మనకు మేలు చేసే ' తౌడు' పీచు ( ఫైబర్) పూర్తిగా నశించి పోతాయి. మిగిలేది కేవలం పిండి పదార్థమే. ఇవి తిన్న వెంటనే రక్తంలో చక్కెర స్థాయిలు అమాంతం పెరుగుతాయి. దీనివల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోయి బొజ్జ పెరగడానికి, స్థూలకాయానికి దారితీస్తుంది.

బ్రౌన్ రైస్/ దంపుడు బియ్యం: ఇందులో పీచు అధికంగా ఉండి చక్కెర నిదానంగా రక్తంలో చేరుతుంది. బీపీ, షుగర్ నియంత్రణకు సహాయ పడుతుంది. విటమిన్ బీ1, బీ3, బీ6, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. నూనెతో రోగాలు ఎన్నో మనం సాధారణంగా వాడే సన్‌ఫ్లవర్, సోయా, పామాయిల్ ఎక్కువగా ప్రాసెస్ అయినవే. ఎక్కువగా వాడితే గుండెజబ్బులు, ఇన్‌ఫ్లామేషన్ ప్రమాదం వుంది. ఒకే నూనెను మళ్లీ, మళ్లీ వేడిచేస్తే విష పదార్థాలు ఏర్పడి క్యాన్సర్, గుండె జబ్బులకు కారణమౌతుంది.

**"ప్రత్యామ్నాయాలు ఇవే"**

గానుగ నూనెలైన నువ్వుల నూనె, ఆవాలు నూనె, వేరుశెనగ నూనె తదితర సాంప్రదాయ నూనెలు కూరలు, వేపుళ్లకు మితంగా వాడితే ఆరోగ్యానికి మంచిదని వైద్యులు చెబుతున్నారు. ఈ నూనెల్లో సహజ. విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తూ జీర్ణక్రియకు సాయపడతాయి. రిఫైండ్ నూనెతో పోల్చితే హానికర పదార్థాలు తక్కువని వైద్యులు చెబుతున్నారు.

**"అలవాట్లే అసలు మార్పు"**

కేవలం ఆహారపదార్థాలు మార్చితే సరిపోదు. మన రుచి అలవాట్లను మార్చుకోవాలి. తక్కువ పరిమాణంలో ఉప్పు, తీపి, నూనె కలిగిన ఆహారానికి నాలుక అలవాటు పడడానికి కనీసం 2 లేదా 3 నెలలు పడుతుంది. ఒకసారి ఆ మార్పు వచ్చాక సహజ రుచులే అమృతంలా అనిపిస్తాయి. అంతేకాక బీపీ, మధుమేహం వంటి వ్యాధులు నియంత్రణలోకి వస్తాయి. ఇప్పటి వరకూ ఎలాంటి సమస్యలు లేనివారిలో ఈ రోగాలు వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని వైద్యులు చెబుతున్నారు.


**ప్రత్యామ్నాయ ఆహారాలను అలవాటు చేసుకోవాలి**

కేవలం నాలుక రుచికోసం చక్కెర, ఉప్పు, తెల్లబియ్యం, అఽధిక నూనెల వినియోగానికి అలవాటు పడి శరీరాన్ని లోలోపలే జబ్బులతో గుల్ల చేసుకోవడం కంటే వాటి స్థానంలో సురక్షితమైన ప్రత్యామ్నా యాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలి. వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితిని అనుసరించి ముందుగా వైద్య నిపుణుల సూచనలతోనే మార్పులు ప్రారంభించాలి. ముఖ్యంగా లోసోడియం ఉప్పు లేదా నూనెల వినియోగంలో జాగ్రత్తలు అవసరం
సో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించండి

**కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాల్ పల్లి 9848445134**

## ఈసాలతక్కలపల్లిలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన సదస్సు

- **ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్**
- **ఆయిల్ ఫామ్ పంటతో రైతులకు రెట్టింపు ఆదాయం**
- **అగ్రికల్చర్ అధికారి బండి ప్రమోద్ కుమార్**



**చట్టం రామగుండం :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఈసాలతక్కలపల్లి గ్రామంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంపుపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేక చొరవతో తక్కలపల్లి గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులకు మొదటి విడతగా బోరుబావులు వేయించే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ముఖ్య అతిథిగా రామగుండం శాసనసభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ, భూగర్భ జలాల శాఖ, తిరుమల ఆయిల్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని నిర్ణీత గడువులోపు పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి" అని సంబంధిత అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ కూడా అందుబాటులోకి వస్తుందని, ప్రస్తుతం మార్కెట్లో ఆయిల్‌పామ్ గెలల ధర టన్నుకు రూ.23,852/గా ఉందని తెలిపారు. 2022లో ఆయిల్‌పామ్ పంట వేసిన రైతులకు ఇప్పటికే దిగుబడి వస్తుందని ఆయన పేర్కొన్నారు.జిల్లా ఉద్యానవన శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు మొక్కలు, డ్రిప్ పరికరాలపై 90%, 80%, 70% సబ్సిడీతో ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. ఆయిల్‌పామ్ సాగు చేయాలనుకునే రైతులకు ఉద్యానవన శాఖ నుండి అన్ని విధాలా సహకారం అందిస్తాం అని తెలిపారు. ఉద్యానవన శాఖ అధికారిణి జ్యోతి మాట్లాడుతూ పామాయిల్ పంటకు చీడపీడల బెడద తక్కువ. తుఫానులను సైతం తట్టుకొని పెరిగే మొండి జాతి మొక్క ఇది. ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులు అధిక లాభాలు పొందవచ్చు. పెద్దపల్లి జిల్లాలోని నేలలు ఆయిల్‌పామ్ సాగుకు అత్యంత అనుకూలం అని వివరించారు. తిరుమల ఆయిల్ కేన్ కంపెనీ సీఈఓ కేషు కళ్యాణ్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.ఈ సమావేశంలో ఏ.ఎం.సి చైర్మన్ గడ్డం తిరుపతి, సర్పంచ్ బండి శ్రీనివాస్, ఉపసర్పంచ్ ఒడ్నాల జ్యోతి, మాజీ సర్పంచ్ ముక్కెర శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఏర్రం స్వామి, భూగర్భ జల శాఖ అధికారులు లావణ్య, సుజాత, మండల వ్యవసాయ అధికారి శ బండి ప్రమోద్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారులు, తిరుమల ఆయిల్ కంపెనీ ఫీల్డ్ స్టాఫ్ ప్రశాంత్, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## గ్రామ, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**



**చట్టం / హనుమకొండ ;** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 4, 6, 8, 10, 12 తేదీలలో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో నిర్వహించనున్న గ్రామ, వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం హన్మకొండ జిల్లా కలెక్టరేట్ నుండి రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించే గ్రామ, వార్డు సభలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంపై ప్రజలకు వివరించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి కుటుంబం మొక్కలు నాటేలా చైతన్యం కల్పించాలని, రహదారుల వెంట పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి అవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలని ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో మురుగు కాల్వల శుభ్రత, పారిశుద్ధ్య కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని, ఇండ్ల నుంచి వచ్చే మురుగు నీరు రోడ్లపైకి చేరకుండా కమ్యూనిటీ, వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని సూచించారు.

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. గ్రామ సభల్లో మహిళల రక్షణ, బాల్య వివాహాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, రహదారి భద్రతపై "అరైవ్ అలైవ్" కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుద్ధ్యం, మురుగు కాల్వల నిర్వహణ, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు చర్యలను చేపట్టాలని తెలిపారు. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లే పరిస్థితుల్లో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తరలింపు చర్యలపై ముందస్తు అవగాహన కల్పించాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమాలకు అనుగుణంగా మొక్కలను సిద్ధం చేసుకోవాలని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో స్పందించే రాష్ట్ర, కేంద్ర విపత్తు నిర్వహణ మరియు రెస్క్యూ బృందాలను సన్నద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో పంటల సాగుపై రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. పంటల అవశేషాలను కాల్చరాదని, అలా చేయడం వల్ల భూమిలోని పోషకాలు నశిస్తాయని, వాటిని కలియదున్నడం ద్వారా భూసారం పెరుగుతుందని వివరించారు. పోలీస్ శాఖ అధికారులు మండల, డివిజన్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామ, వార్డు సభల్లో పాల్గొని ప్రజలకు ప్రకృతి వైపరీత్యాలు, వర్షాలు, పిడుగుల సమయంలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. జూన్ 10న జరిగే ప్రతి గ్రామ సభలో "అరైవ్ అలైవ్" కార్యక్రమాలు నిర్వహించాలని, రహదారి భద్రతా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. జూన్ 12న నిర్వహించనున్న డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రైతులకు సీజన్‌కు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ టిసి లో అదనపు కలెక్టర్ రవి, డిపిఓ లక్ష్మీ రమాకాంత్, సిపిఓ, విద్యుత్తు, విద్య, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఓ లు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఇబ్బంది పెట్టకండి



- **అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు**
- **జిల్లా కలెక్టర్**

**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండలం మోడేగాం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం పరిశీలించడం జరిగింది. సదాశివనగర్ మండలం మోడేగాం గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. నిర్మాణాల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి, పనులు వేగవంతంగా పూర్తి చేసి లబ్ధిదారులకు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు ఇల్లు కూలిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న లబ్ధిదారురాలు పిల్లి సాయవ్వతో కలెక్టర్ మాట్లాడారు. గతంలో పూరి గుడిసెలో నివసిస్తూ వర్షాలకు తన ఇల్లు కోల్పోయానని, ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇల్లు ద్వారా సురక్షితమైన నివాసం కలగబోతుందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, తమలాంటి పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కామారెడ్డి జిల్లాను గుడిసెలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం ద్వారా పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ప్రతి కుటుంబానికి సురక్షితమైన గృహం అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లలో పూరి గుడిసెలో ఉన్నవారిని గుర్తించి వారికి ఇళ్లు మంజూరు చేయాలని, ఎక్కడా కూడా పూరి గుడిసెలు కనిపించకూడదని, అధికారులు ప్రతీ గ్రామాన్ని పర్యటించి చర్యలు చేపట్టాలని, గ్రామీణ పేద కుటుంబాల ఆర్థిక సాధికారతకు స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలో రూ.1.59 కోట్లు 45 లక్షల బ్యాంకు రుణాలను 90 మంది లబ్ధిదారులకు మంజూరు చేయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని, కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడే కార్యకలాపాలను చేపట్టాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా పేద కుటుంబాల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కలెక్టర్ వెంట పీడీ హౌసింగ్ విజయపాల్ రెడ్డి, MRO సత్యనారాయణ, MPDO, mpo, పంచాయతీ కార్యదర్శి, తదితరులు ఉన్నారు.

## కామారెడ్డి జిల్లాలో అధికారుల బదిలీలు, నూతన బాధ్యతలు

- **కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అధికారులు**
- **డీబీసీడీఓగా పి. నర్సయ్య, విద్యా శాఖ అధికారిగా ఎల్. మల్లిఖార్జున్ బాధ్యతలు**





**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** కామారెడ్డి జిల్లాలో బుధవారం పలువురు అధికారులు నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

**డీబీసీడీఓగా బాధ్యతలు స్వీకరించిన పి. నర్సయ్య**

జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి (DBCDO)గా పి. నర్సయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు.

**విద్యా శాఖ అధికారిగా ఎల్. మల్లిఖార్జున్**

నూతన విద్యా శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎల్. మల్లిఖార్జున్ బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు.

**బదిలీపై వెళ్తున్న డీఈఓ రాజుకు సన్మానం**

బదిలీపై వెళ్తున్న విద్యా శాఖ అధికారి రాజును బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ ప్రతినిధులు, విద్యా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

**పిఆర్టియు ఆధ్వర్యంలో సన్మానం..**

కామారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న రాజు టి పి ఆర్ టి యూ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానం చేశారు. గత ఎనిమిది సంవత్సరాల నుంచి కామారెడ్డి జిల్లాకు ఎంతో సేవ చేశారని పిఆర్టియు నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖలో వివిధ హోదాలో పనిచేస్తున్న జిల్లా అధికారులు, మండల విద్యాధికారులు పి ఆర్ టి యు తెలంగాణ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు అంబీర్ మనోహర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జనపాల లక్ష్మీరాజం, రాష్ట్ర మరియు జిల్లా నాయకులు లెనిన్, గిరి, మారుతి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 7లోగా మొక్కజొన్న సేకరణ పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్**



**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** పద్మాజీవాడి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ బుధవారం పరిశీలించారు. జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన సదాశివనగర్ మండలం పద్మాజీవాడి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు, రవాణా ప్రక్రియల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రం ద్వారా ఇప్పటివరకు 18,840 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇందులో 15,000 క్వింటాళ్ల మొక్కజొన్నను ఇప్పటికే గోదాములకు తరలించగా, ప్రస్తుతం కేంద్రం వద్ద 3,840 క్వింటాళ్ల మొక్కజొన్న నిల్వ ఉన్నట్లు తెలిపారు. అలాగే కేంద్రంలో ఇంకా 16 మొక్కజొన్న కుప్పలు ఉండగా, వాటి ద్వారా సుమారు 3,000 సంచుల మొక్కజొన్న కొనుగోలు జరిగే అవకాశం ఉందని వివరించారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలు, సూచనలను తెలుసుకున్నారు. జూన్ 7వ తేదీలోగా మొక్కజొన్న సేకరణ ప్రక్రియను పూర్తిచేయాలని డీఎం మార్క్‌ఫెడ్‌ను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేగంగా గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర ప్రయోజనాలు పూర్తిగా అందేలా చూడాలని, కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, జిల్లా సహకార అధికారి (డీసీఓ), డీఎం మార్క్‌ఫెడ్, జిల్లా పౌర సరఫరాల అధికారి (డీసీఎస్ఓ), డీఎం (సివిల్ సప్లైస్), తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయ అధికారి (ఎంఏఓ), మానిటరింగ్ అధికారి, పీఏసీఎస్ అధ్యక్షులు, సర్పంచ్, వార్డు సభ్యులు, పీఏసీఎస్ కార్యదర్శి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## తెలంగాణకు భారీ వర్ష సూచన.. 18 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్



**చట్టం ;** తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈ రోజు, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు.భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాలు పడనున్నందున, ముఖ్యంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana - 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com